PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 107 | విజయవాడ, శుక్రవారం 18 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Friday 18 November 2022 | Rs

రేపు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానాలను వ్యతిరేకిస్తూ బ్యాంకింగ్ ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చారు. తమ డిమాండ్‌లను పరిష్కరించాలని నవంబర్ 19న సమ్మె చేపడుతున్నామని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ) జనరల్ సెక్రటరీ వెంకటాచలం తెలిపారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం వల్ల ఖాతాదారుల సొమ్ముకు, భద్రతకు విఘాతం కలుగుతుందన్నారు. ఈ విధానాల వల్ల ఉద్యోగాలతో పాటు, ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పాడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



యువ క్రికెటర్లకు సదవకాశం

- నేడు న్యూజిలాండ్‌తో తొలి టి20

లోపలి పేజీలో..

ప్రజా ప్రయోజనాలే ముఖ్యం

- పారదర్శకంగా ఉంటే భయమేల?
- సమీక్షాధికారమే లేదంటే ఎలా?
- సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం
- విచారణ పూర్తి... తీర్పు రిజర్వు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తమకు ప్రజల ప్రయోజనాల పరిరక్షణే ముఖ్యమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. గత ప్రభుత్వ నిర్ణయాల (అమరావతి, ఫైబర్ నెట్) పై దర్యాప్తుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌పై హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం పూర్తి చేసింది. తీర్పు రిజర్వు చేసింది. అంతకుముందు టిడిపి నేత వర్ల రామయ్య తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్ధ దవే వాదనలు వినిపిస్తూ రాజకీయ దురుద్దేశాలతోనే సిట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి, టిడిపి ప్రభుత్వంపై ఒక్క పిటిషన్ కూడా దాఖలు చేయలేదని చెప్పారు. టిడిపి ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని జగన్ ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. మాజీ న్యాయమూర్తితో విచారణ జరిపిస్తే తమకేమీ అభ్యంతరం లేదని, కానీ రాజకీయ నేతల చేత విచారణ జరపడమేంటని ప్రశ్నించారు. స్పీకర్ చెప్పిన వెంటనే విచారణ జరపడం సమంజసం కాదని పేర్కొన్నారు. నిజానిజాలు తెలుసుకోవడానికి కమిటీ వేస్తే తమకేమీ అభ్యంతరం లేదని, కానీ ఆ కమిటీ సిఫార్సుల మేరకు చర్యలు తీసుకుంటామనడమే అభ్యంతరమని చెప్పారు. సిబిఐకి లేఖ రాసినా స్పందించలేదని, దీనర్థం పున:సమీక్షించాల్సిన అవసరం లేదని సిబిఐ భావించి ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు కేసుల్లో తీర్పులను ఉటంకించారు.

శాశ్వతంగా తప్పించుకోగలరా?

ఈ సందర్భంగా ధర్మాసనం పలు ప్రశ్నలు వేసింది, పారదర్శకంగా ఉంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించింది. సిట్ విచారణ తరువాత అయినా కోర్టులో ఛాలెంజ్ చేయొచ్చు కదా అని న్యాయమూర్తులు ప్రశ్నించారు. సిట్ మధ్యంతర నివేదిక ఇచ్చిన తరువాత, హైకోర్టు జిఓపై ఎలా స్టే విధిస్తుందని ప్రశ్నించారు. రాజకీయ వైరుధ్యముంటే దర్యాప్తు చేయవద్దా? విచారణలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి కదా? అని జస్టిస్ ఎంఆర్ షా ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు చేసిన నిర్ణయాలపై సమీక్ష జరిపే అధికారమే లేదంటే ఎలా ?, వారికి వందశాతం ఇమ్యునిటీ (బలం) ఇచ్చినట్లే కదా? అని అన్నారు.' శాశ్వతంగా తప్పించుకోగలరా?, ఇది ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకం కాదా?' అని ప్రశ్నించారు. జిఓ ఇవ్వకుండా, అంతర్గత విచారణ జరిపితే ఏం చేసేవారని ప్రశ్నించారు. దర్యాప్తు ఎవరూ చేసినా సరే, తమ ప్రయత్నమంతా ప్రజాప్రయోజనం కోసమననే ధర్మాసనం పేర్కొంది.

జంతువులపైనే పరిశోధనలు!

- కోవాక్సిన్‌పై కలవరపెడుతున్న లాన్సెట్, స్టాట్ కథనాలు
- రాజకీయ ఒత్తిడితో నామమాత్రంగా ట్రయల్స్
- కీలక పరీక్షలను విస్మరించిన భారత్ బయోటెక్
- ఖండించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ : కరోనా వైరస్ కట్టడికి దేశంలో విస్తృతంగా వినియోగించిన కోవాక్సిన్ వ్యాక్సిన్‌కు అనుమతులు లభించిన తీరు వివాదాస్పదంగా మారింది. కోవాక్సిన్‌ను తయారు చేసిన హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ కంపెనీ ట్రయల్స్‌కు సంబంధించిన నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించలేదని తాజాగా వెల్లడైంది. ఈ మేరకు వివరాలతో సహా 'లాన్సెట్' పరిశోధన కథనాన్ని ప్రచురించింది. సైన్స్, వైద్యం తదితర అంశాలకు సంబంధించి కీలక పత్రాలకు లాన్సెట్ వేదిక అన్న సంగతి తెలిసింది. దీని ఆధారంగా వైద్య విషయాల ప్రచురణ సంస్థ స్టాట్ చేసిన పరిశోధనలో జంతువుల మీద తప్ప మనుషుల మీద పూర్తి స్థాయిలో కోవాక్సిన్‌ను పరిశీలించలేదన్న విషయం తేలింది. భారత్ బయోటెక్‌కు చెందిన ఒక కీలక వ్యక్తి ఈ విషయాన్ని ధృవీకరించినట్లు తెలిపిన స్టాట్, దీని వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని పేర్కొంది. లాన్సెట్, స్టాట్‌ల సమాచారం ఆధారంగా 'ది వైర్' ప్రచురించిన తాజా కథనం దుమారాన్ని రేపింది. దీంతో రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం నష్ట నివారణ చర్యలను ప్రారంభించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ గురువారం జారీ చేసిన ప్రకటనలో ఈ కథనాలను ఖండించింది.

ఏం జరిగింది....?

కరోనా ఉధృతంగా వ్యాపించిన సమయంలో స్వదేశీ తయారీ అంటూ కోవాక్సిన్‌కు కేంద్ర ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పించిన సంగతి తెలిసిందే. వృద్ధులతో ప్రారంభించి విడతల వారీగా అందరికీ ఈ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇంత త్వరగా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకురావడాన్ని తమ ఘనతగా పేర్కొంటూ మోడీ ప్రభుత్వం భారీ ప్రచారాన్ని చేసుకుంది. ఈ క్రమంలో సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ కంట్రోల్



ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఓ) రూపొందించుకున్న నిబంధనలను కూడా పాటించలేదు. స్టాట్ కథనం ప్రకారం వ్యాక్సిన్‌కు మూడు విడతలుగా ట్రయల్స్ నిర్వహించాల్సిఉండగా ఏ విడతలోనూ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించలేదు. ట్రయల్స్‌కోసం మొదటి రెండు విడతల్లో భాగస్వాములైన వారి సంఖ్య నుండి, అనుసరించిన పద్ధతుల వరకు అనుమానాస్పదంగా మారాయి. వ్యాక్సిన్ ట్రయల్స్ కోసం ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ డిపార్ట్‌మెంటు లెక్కల ప్రకారం మొదటి విడతలో 402 మందికి, రెండవ విడతలో 394 మందికి వ్యాక్సిన్ ఇచ్చారు. అయితే, జనవరి 2021లో 'లాన్సెట్'కు ఇచ్చిన అధికారిక సమచారంలో 375 మందికి మొదటి డోసును, 368 మంది రెండవ డోసును వేసినట్లు పేర్కొన్నారు. అయితే, 'మారుమూల ప్రాంతాల్లో కూడా ట్రయల్స్ నిర్వహించడం వల్ల కొంత సమన్వయ సమస్యలు ఏర్పడ్డాయని, అందువల్ల ప్రయోగాత్మకంగా వ్యాక్సిన్ వేసుకున్న వారి అందరి వివరాలు సేకరించలేకపోయామని భారత్ బయోటెక్ కంపెనీ తెలియచేసింది.

'ప్లాసి బో' ను విస్మరించారు!

వ్యాక్సిన్ ట్రయల్ రన్‌లో భాగస్వాములయ్యే వారిని రెండు గ్రూపులుగా విభజించి పరీక్షలు నిర్వహించాల్సివుంది. ఒక గ్రూపు వారికి వ్యాక్సిన్ వేసి, రెండో గ్రూపు వారికి డమ్మీ వ్యాక్సిన్ వేసి ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఎవరికి ఏది వేస్తున్నారన్న అంశాన్ని గోప్యంగా ఉంచుతారు. సైడ్ ఎఫెక్ట్స్‌తోపాటు, మానసిక ఒత్తిళ్లను గుర్తించడానికి ఇలా చేస్తారు. ఇలా డమ్మీ వ్యాక్సిన్ వేయడాన్ని 'ప్లాసి బో'గా వ్యవహరిస్తారు. దీనివల్ల వ్యాక్సిన్ వేసిన వారికి, వేయని వారికి మధ్య గల తేడాను, వేసుకున్న వారికి తలెత్తే సమస్యలను గుర్తించడం వీలవుతుంది. అయితే, భారత్ బయోటెక్ ఈ పరీక్షను పూర్తిగా విస్మరించింది. డమ్మీ వ్యాక్సిన్ వేయడానికి బదులుగా ఒక గ్రూపు వారికి ఒక పద్ధతిలో తయారైన కోవాక్సిన్‌ను, మరో గ్రూపు వారికి ఇంకో పద్ధతిలో తయారైన కోవాక్సిన్‌ను వేశారు. ఈ విధానం వల్ల ఈ రెండింటిలో ఏది మెరుగైనదో మాత్రమే తెలుసుకోవడం సాధ్యమవుతుంది.

జంతువుల మీద జరిపిన పరీక్షలే...!

తొలివిడత వ్యాక్సిన్ వేసిన వారి ఫలితాలు రాకముందే రెండవ విడత ట్రయల్స్ చేయడానికి సిడిఎస్‌సిఓ సబ్జక్టు ఎక్స్‌పర్ట్ కమిటీ భారత్ బయోటెక్‌కు అనుమతిచ్చింది. మొదటి విడత ట్రయల్స్‌కు ముందు జంతువులపై చేసిన ప్రి-క్లీనికల్ పరీక్షా ఫలితాల ఆధారంగా రెండవ విడత ట్రయల్స్‌కు అనుమతిచ్చారు. మొదటి విడత ట్రయల్స్‌లో శ్యాంపిల్ సంఖ్య తక్కువ వుంది కాబట్టి అనుమతిచ్చారని భావించినా, రెండవ విడత ట్రయల్స్ ఫలితాలు రాకముందే మూడవ విడత పరీక్షలకు అనుమతిచ్చేశారు. అప్పటికీ అధికారికంగా అందుబాటులో ఉన్నది జంతువులపై జరిపిన పరీక్షలే!నిజానికి రెండవ విడతలో వ్యాక్సిన్ సురక్షితమా కాదా అన్న అంశాన్ని, మూడవ విడతలో ఎంత సామర్ధ్యంతో వ్యాక్సిన్ పనిచేస్తోందన్న అంశాన్ని పరిశీలించాల్సిఉంది. దీనిపై భారత్ బయోటెక్‌కు చెందిన డైరక్టర్ ఒకరు జంతువుల మీద జరిపిన పరీక్షల ఆధారంగానే మూడవ విడత ట్రయల్స్‌ను నిర్వహించినట్లు 'స్టాట్'కు చెప్పారు. తమపైన పదేపదే తీవ్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు వచ్చాయని, రెగ్యులేటర్లు కూడా ఏదో రకంగా ట్రయల్స్ పూర్తి చేయాలని ఒత్తిడి చేశారని, దీంతో తమకు మరో మార్గం లేకుండా పోయిందని ఆయన చెప్పినట్లు స్టాట్ ప్రచురించింది.

డబ్ల్యుహెచ్ఓ సస్పెండ్ చేసిన ఏకైక వ్యాక్సిన్

ఐక్య రాజ్యసమితి ఏజెన్సీలకు కోవాక్సిన్ సరఫరా చేయడాన్ని డబ్ల్యుహెచ్ఓ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. 'మంచి తయారీ పద్ధతుల (గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టిసెస్)ను మిగతా 5లో

ప్రాంతీయ పార్టీల రాజకీయ సర్కస్

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల రాజకీయ సర్కస్ నడుస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో అంటకాగుతూ రాజకీయ సర్కస్ చేస్తున్నాయన్నారు. తిరుపతి ఎంబి భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీ, రాష్ట్రాభివృద్ధిపై పైన పేర్కొన్న మూడు పార్టీలు విస్మరించాయన్నారు. 'ఇప్పుడు గెలిస్తే రానున్న 30 ఏళ్లు నేనే సిఎం' అని జగన్మోహన్‌రెడ్డి చెప్పుకుంటుండగా, 'ఈసారి సిఎంగా నన్ను గెలిపించకపోతే ఇవే నా ఆఖరి ఎన్నికలు' అంటూ చంద్రబాబునాయుడు ప్రజల ముందుకెళుతున్నారన్నారు. 'త్వరలో రాష్ట్రానికి మేలు జరుగుతుందని పవన్‌కల్యాణ్ చెబుతున్నారని, ఆ మేలు రాష్ట్రానికా..?.. పవన్‌కల్యాణ్‌కా..?' అన్నది



చెప్పాలని ప్రశ్నించారు. విద్యుత్తు మీటర్లు పెడితే నాణ్యమైన విద్యుత్తు వస్తుందని విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు సంస్కరణలను అమల్లోకి తెస్తోందని, దీన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పట్టభద్రులు, టీచర్ల ఎన్నికల్లో మేధావులు, టీచర్లు పోటీ చేసి పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా గెలుస్తున్న నేపథ్యంలో అలాంటి 'పెద్దల' సభలో ప్రజాస్వామ్యం గొంతు నొక్కేలా బిజెపి, టిడిపి, వైసిపి అభ్యర్థులను ప్రకటించారన్నారు. మేధావుల ఎన్నిక ఔనత్యాన్ని దిగజార్చే విధంగా అధికార పార్టీ అక్రమాలకు పాల్పడుతోందని ఆగ్రహించారు. వలంటీర్ వ్యవస్థ నుంచి ఐఎఎస్‌ల వరకు అధికారులను ఉపయోగించుకుని నకిలీ ఓటర్లను చేర్పించిందని విమర్శించారు. వామపక్ష ప్రజాతంత్ర శక్తులుగా ఈ అక్రమాలను తీవ్రంగా అడ్డుకుంటామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గత రెండేళ్లుగా టిటిడి అటవీ కార్మికులు ఆందోళన చేస్తున్నా.. యాజమాన్యం కార్మికుల పట్ల వివక్ష పాటిస్తూ కొందరిని రెగ్యులరైజ్ చేస్తూ, మరికొందరిని టిటిడి కార్పొరేషన్‌లో కలుపుతోందన్నారు. టిటిడి యాజమాన్యం అందరికీ సమన్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పాల్గొన్నారు.

లోపలి పేజీల్లో..

కేంద్ర పరిమితి లోనే

- రుణాలపై ఆర్థికశాఖ మంత్రి
- బాబు మాటలు అసంబద్ధమని విమర్శ

ప్రభుత్వాలు ఉన్నంతకాలం ఉద్యోగుల సమస్యలుంటాయ్

- మంత్రి బొత్స వ్యాఖ్య

'లేఖ' బహిర్గతంపై 12న విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిజెఐకి రాసిన లేఖ బహిర్గతం చేయడంపై విచారణను డిసెంబర్ 12కు సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఆ రోజున విచారణ నిర్వహిస్తామని ధర్మాసనం తెలిపింది. అదే సమయంలో వైఎస్ జగన్‌కు నోటీసులు జారీ చేయడానికి నిరాకరించింది. 2020 అక్టోబర్ 4న న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎస్‌వి రమణపై సిజెఐకి ముఖ్యమంత్రి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఈ లేఖను బహిర్గతం చేశారు. దీనిపై న్యాయవాది సునీల్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. అనారోగ్యంతో బాధపడుతున్న తన సీనియర్ న్యాయవాది కోర్టుకుహాజరు కాలేకపోవడంతో పిటిషనరే స్వయంగా హాజరయ్యారు. సిఎం జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రకటనపై జస్టిస్ ఎంఆర్ షా ప్రశ్నించారు. దీనికి సంబంధించి ఆయన పిటిషన్‌లోని వివరాలను చదివి వినిపించారు. ఈ పద్ధతిని అనుమతించకూడదని ధర్మాసనాన్ని కోరారు. దీంతో ధర్మాసనం జోక్యం చేసుకొని దీన్ని గత ప్రభుత్వాల నిర్ణయాలపై దాఖలు అయిన పిటిషన్ నుండి వేరు చేసి విడిగా విచారిస్తామని తెలిపారు. ఆ మేరకు డిసెంబర్ 12కు వాయిదా వేశారు.

విద్యా రుణాలపై కోత

- లక్ష్యాన్ని తగ్గించుకున్న బ్యాంకులు
- గతేడాదితో పోల్చితే 13 శాతం కుదింపు



హైదరాబాద్ : కార్పొరేట్లకు రూ.వేల కోట్ల రుణాలను అప్పనంగా ఇచ్చే బ్యాంక్‌లు విద్యార్థుల చదువులకు మాత్రం రుణాలివ్వడానికి వెనకాడుతున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ విభాగం రుణాల మంజూరులో 13.5 శాతం కోత పెట్టాలని ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి) నిర్ణయించాయని తెలుస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2021-22)లో 12 పిఎస్‌బిలు మొత్తంగా రూ.23,640 కోట్ల విద్యా రుణాలు అందించగా.. వీటిని ప్రస్తుత 2022-23లో రూ.20,450 కోట్ల రుణాలకు పరిమితం చేయాలని బ్యాంక్‌లు లక్ష్యంగా పెట్టుకున్నాయని ఓ ఆంగ్ల పత్రిక రిపోర్టు చేసింది. దేశంలో మొత్తం విద్యా రుణాలలో దాదాపు 90 శాతం పిఎస్‌బిలే ఇస్తున్నాయి. సామాజిక బాధ్యత కొరవడిన ప్రయివేటు రంగ బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిల వాటా 10 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. విద్యా రుణాల మంజూరులో బ్యాంకులు నిర్దేశించుకున్న లక్ష్యం కూడా చాలా నెమ్మదిగా సాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర లక్ష్యంలో జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి కేవలం 19 శాతం లక్ష్యాన్ని మాత్రమే చేరాయి. రూ.7.5 లక్షల కంటే తక్కువ పరిమాణ రుణాల మంజూరులో బ్యాంకులు మరింత కఠిన నిబంధనలు అమల్జేస్తున్నాయి. ఈ రుణాలు ఎక్కువగా నిరర్థక ఆస్తులుగా మారుతున్నాయని సాకుగా పేర్కొంటున్నాయి. దేశీయంగానూ టెక్నికల్ కోర్సులకు వ్యయం భారీగా పెరిగిన నేపథ్యంలో విదేశీ విద్యకు భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో అనేక మంది మధ్య తరగతి కుటుంబాలు విద్యా రుణాలపై ఆధారపడుతున్నాయి. కానీ బ్యాంక్‌లు వారిని నిరాశకు గురి చేస్తున్నాయి. విద్యా రుణాల తగ్గుదలపై విద్యా నిపుణులూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నిరాసనకారులపై కాల్పులు

- ఇద్దరు చిన్నారులతో సహా తొమ్మిది మంది మృతి

టెహ్రాన్ : ఇరాన్‌లో నిరాసనకారులపై బైక్‌పై వచ్చిన దుండగులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు చిన్నారులు, ఒక మహిళతో సహా తొమ్మిది మంది మరణించారు. దక్షిణ ఇరాన్‌లో రెండు వేరువేరు ప్రాంతాల్లో బుధవారం ఈ కాల్పుల ఘటనలు జరిగినట్లు ఇరాన్ అధికార మీడియా గురువారం వెల్లడించింది. బుధవారం ముందుగా ఖుజెస్తాన్ రాష్ట్రంలో సాయంత్రం 5 గంటల సమయంలో ఇజెహాలో జరిగిన కాల్పుల ఘటనలో ఐదుగురు మృతి చెందగా, పది మంది గాయపడ్డారు. ఇందుకు సంబంధించి ముగ్గురు అనుమానితుల్ని అరెస్టు చేశామని, మిగిలినవారి కోసం గాలిస్తున్నట్లు స్థానిక పోలీసు అధికారులు తెలిపారు. ఈ ఘటన జరిగిన నాలుగు గంటల తరువాత ఇరాన్‌లో మూడో అతి పెద్ద నగరం ఇస్ఫాహన్‌లో జరిగిన రెండో ఘటనలో నలుగురు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మరణించిన వారిలో 45 ఏళ్ల మహిళ, 13 ఏళ్ల వయస్సు ఉన్న ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కాల్పులకు పాల్పడింది ఉగ్రవాదులుగానే పోలీసులు అనుమానిస్తున్నారు.

సైన్యం కాల్పులు

ఇరాన్ రాజధాని టెహ్రాన్ మెట్రో స్టేషన్‌లో బుధవారం నిరసనకారులపై సైన్యం కాల్పులకు తెగబడింది. అమిని మృతికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మెట్రో స్టేషన్‌లో నిరసనకారులు తమ హిజాబ్‌లను దగ్ధం చేశారు. నిరసనకారులను చెదరగొట్టడానికి సైన్య కాల్పులు జరిపింది. దీంతో ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న దృశ్యాలు సామాజిక మీడియాలో వైరల్‌గా మారాయి. సైన్యం చేతిలో ఇప్పటి వరకూ 300 మంది మరణించారు. 15 వేల మందిని అరెస్టు చేశారు.

భూ సర్వేలో అవకతవకలు

- క్షేత్రస్థాయిలో గందరగోళం
- తుదినోటిఫికేషన్లు ఇస్తామంటున్న సిసిఎల్ఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూహక్కు, భూరక్ష పథకం కింద నిర్వహిస్తున్న సర్వేలో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. భూ రికార్డులను డిజిటలైజ్ చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం రైతులకు శాపంగా మారుతోంది. రాష్ట్రంలో కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేటలో ప్రయోగాత్మకంగా చేసిన ఈ పథకంలో అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి. వీటిని ఏమాత్రం సవరించకుండానే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో కనీసం నాలుగు మండలాల్లో మండలానికి ఒక గ్రామం చొప్పున ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించారు. రోవర్లు, డ్రోన్లు ఇలా ఆధునిక పద్ధతుల్లో చేపట్టిన ఈ సర్వేలోనూ అనేక లోపాలను గుర్తించారు. అయినా, వీటిని సరిచేయలేదు. ఆంధ్రప్రదేశ్ సర్వే మరియు సరిహద్దు చట్టం 1923 సెక్షన్ 13 ప్రకారం సర్వే విజయవంతంగా పూర్తయిందని ప్రకటించి తహశీల్దార్లకు టార్గెట్లు పెట్టారు. దీంతో తహశీల్దార్లు, సర్వే అధికారులు ఎక్కడికక్కడ సర్వేలు నిర్వహించి ఫైనల్ నోటిఫికేషన్లు ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వే మరియు సరిహద్దు చట్టం 1923 సెక్షన్ 14 ప్రకారం ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుల ద్వారా తేల్చుకోవాలని ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లలోనే పేర్కొన్నారు. అయితే ఎక్కువ గ్రామాల్లో భూ కమతాల్లో భూములు వారి దగ్గర ఉన్న రికార్డులకంటే తక్కువగా ఉన్నట్లు చూపెడుతున్నారు. బ్రిటీష్‌కాలంలో సర్వే నిర్వహించారని, మరలా ఇప్పుడు నిర్వహిస్తున్నారని సరిహద్దులు స్వల్పంగా మారే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు గతంలోనే తెలిపారు. సర్వే అనంతరం రికార్డుల్లో తక్కువ చూపించిన రైతులతో సంప్రదించి మార్పులు చేర్పులు చేసిన తరువాత ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాలని వ్యవసాయ రంగ నిపుణులు ఎర్నేని నాగేంద్రనాథ్ సూచించారు. ఒక గ్రామంలో 23 ఎకరాల భూమి ఉంటే 13 సెంట్లు చూపించారని, దీనిపై కనీస వివరణ ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా మక్కువ... మ(క్రి)వలస మండల పరిధిలోని ఓ గ్రామంలోనూ ఇదే సమస్య వచ్చిందని, అక్కడి రైతు తెలిపారని వివరించారు. దీనిపై సిసిఎల్‌ను కలవగా ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చే ముందు రైతులతో సంప్రదింపులు జరపాలని సూచిస్తూ సర్క్యులర్ ఇచ్చారని, అదే సమయంలో టార్గెట్ పెట్టారని చెప్పారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. ఒక్కసారి ఫైనల్ నోటిఫికేషన్ ఇస్తే కోర్టు ద్వారా తేల్చుకోవాల్సి ఉంటుందని, అది ఇప్పట్లో తేలే అవకాశం ఉండదని అంటున్నారు. దీనిపై సిసిఎల్ఏను కలిసి వినతిపత్రం ఇద్దామని, సమస్యను వివరిద్దామని అనుకున్నా అపాయింట్‌మెంట్ దొరకడం లేదని రైతు నాయకులు చెబుతున్నారు. దీనిపై చర్చించుకుని త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామంటున్నారు. ఈ సర్వేలో అన్నీ అక్రమాలు జరుగుతున్నాయని మొత్తం గ్రామంలో 600 ఎకరాలు ఉన్నాయనుకుంటే లెక్కలు మారినా అంతే విస్తీర్ణాన్ని చూపించాలని, కానీ తక్కువ చేసి చూపిస్తున్నారనిఅంటున్నారు. దీనివెనుక మోసం ఉందని, దీనిపైనా తేల్చాల్సి ఉంటుందని భూ యజమానులు డిమాండు చేస్తున్నారు. 2023 జనవరి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా సర్వే పూర్తిచేసి మ్యాపులు ఇస్తారని, అనంతరం అంతకుముందున్న రికార్డులన్నీ తొలగిస్తారని, దీనివల్ల రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు తెలిపారు. సర్వే సక్రమంగా జరగడం లేదని, అధికారులు ఇష్టం వచ్చినట్లు చేసుకుపోతున్నారని పేర్కొన్నారు. సర్వే సమయంలో రైతులతో చర్చించి రికార్డులు పరిశీలించి సర్వే చేయాలని చట్టంలో ఉందని, అలా కాకుండా తాము సర్వే చేశామని చెబుతూ నేరుగా బోర్డులు పెట్టేస్తున్నారని వివరించారు. ప్రస్తుతం 1500 గ్రామాల్లో సర్వే జరుగుతోందని, పూర్తయితే గానీ మరిన్ని విషయాలు వెలుగులోకి రావని ఆయన చెప్పారు.

స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ

సలహాదారుగా నారమల్లి పద్మజ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ రాష్ట్ర సలహాదారుగా వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, తిరుపతికి చెందిన నారమల్లి పద్మజ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి ఎఆర్ అనురాధ గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. పద్మజ టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ కీర్తి శేషులు ఎన్ శివప్రసాద్ సోదరి. ఆయన టిడిపిలో కొనసాగుతున్నప్పటి నుంచే పద్మజ వైసిపిలో పనిచేశారు. వివిధ రంగాలకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి ఎక్కువ మంది సలహాదారులు ఉన్నారన్న విమర్శల నేపథ్యంలో మరో సలహాదారు నియామకం జరగం విశేషం.

లోపలి పేజీల్లో..

మెటా ఇండియా బాస్‌గా సంధ్యా దేవనాథన్

- కొత్త ఏడాదిలో బాధ్యతలు

ప్రభుత్వాలు ఉన్నంతకాలం ఉద్యోగుల సమస్యలుంటాయ్

- మంత్రి బొత్స వ్యాఖ్య


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉన్నంత కాలమూ ఉద్యోగుల సమస్యలుంటాయని, వారికి తీరే కోరికలుంటే మంచిదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్ చంద్రశేఖర్ రెడ్డికి సచివాలయంలో నూతనంగా కేటాయించిన చాంబరును గురువారం బొత్స ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ప్రజా వ్యవహారాల సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి మంత్రి మాట్లాడారు. 11వ పిఆర్‌సి వల్ల నష్టం జరిగిందంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు. ఉద్యోగులు కొన్ని అంశాలపై కోర్టులకు వెళ్లడం వల్ల ప్రభుత్వానికి ఇబ్బందేమీ లేదని తెలిపారు. సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్రంతో తీసిపోని విధంగా 11వ పిఆర్‌సిని అమలు చేశామన్నారు. సజ్జల మాట్లాడుతూ ప్రజలకు అందించే సంక్షేమ పథకాల గురించి ఉద్యోగులు ప్రస్తావన చేయొద్దని పేర్కొన్నారు. సిఎంను బెదరగొట్టాలని, అదరగొట్టాలని చూస్తే ఉపయోగం ఉండదని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాల అమలులో మంచి ఫలితాలు రావాలంటే ఉద్యోగుల పాత్ర ముఖ్యమని చెప్పారు. కాగా ఉద్యోగులు సిపిఎస్ రద్దు హామీ గురించి ప్రశ్నించగా మంత్రి బొత్స, సజ్జల దాటవేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎపి సెక్రటేరియట్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పరిమితి లోనే

- రుణాలపై ఆర్థికశాఖ మంత్రి బుగ్గన
- బాబు మాటలు అసంబద్ధమని విమర్శ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టంగానే ఉందని, అయినా కేంద్రం నిర్ధేశించిన పరిమితిలోనే రుణాలను తీసుకున్నామని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. సచివాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పతిపక్షనేత చంద్రబాబు మాట్లాడుతున్న విధానం అసంబద్ధంగా ఉందన్నారు. ఆదాయం పెరుగుతున్నప్పటికీ... అది ఆశించిన స్థాయిలో లేదన్నారు. ఇదే సమయంలో ఖర్చులు కూడా ఎక్కువ కావడంతో ఆదాయ వ్యయాల మధ్య సమతుల్యత లేకుండా పోతోందన్నారు. పరిమితికి మించి రుణాలు చేయడం లేదని, తొమ్మిది నెలలకు కేంద్రం ఇచ్చిన పరిమితికి లోబడే ఇప్పటివరకు రుణాలు తీసుకున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం అనుమతికి మించి చేసిన రుణాల కారణంగా 17 వేల కోట్లను ప్రస్తుత ప్రభుత్వ పరిమితి నుంచి కేంద్రం తగ్గించిందని, ఆ మొత్తానికి అనుమతి ఇవ్వాలని కోరుతున్నాం తప్ప అదనపు రుణం అడగడం లేదని అన్నారు. ఆ 17 వేల కోట్ల అంశం 14వ ఆర్థిక సంఘానికి సంబంధించినదని, ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం పరిధిలో ఉన్నామని గుర్తు చేశారు. తెలుగుదేశం నేతలు పదేపదే తనను అప్పుల మంత్రిగా అంటున్నారని, అప్పులు చేసేది ఆర్థిక మంత్రే కానీ హోంమంత్రి కాదుకదా అని వ్యాఖ్యానించారు. గతంలో యనమల కూడా ఇంతకన్నా ఎక్కువ అప్పులు చేశారని అన్నారు. తాను 15 శాతం అప్పులు చేస్తే, యనమల 20 శాతం చేశారని, ఆయనను ఏమనాలని ప్రశ్నించారు. రాయలసీమ పర్యటనల్లో చంద్రబాబు చేస్తున్న ప్రసంగాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని బుగ్గన చెప్పారు. ఎన్నికల్లో గెలిపిస్తేనే రాజకీయాల్లో ఉంటానని చెప్పడంపై స్పందిస్తూ 2019లో ఓడించారు కదా అని గుర్తు చేశారు. తమ ప్రభుత్వ పాలనపైనా అన్నీ అబద్ధాలు చెబుతున్నారన్నారు. బడులు మూసేసారని, పిల్లలు చదువు మధ్యలో మానేస్తున్నారని చెప్పడం వాస్తవాలకు దూరమన్నారు. చంద్రబాబు తన హయాంలో 34 వేల ఉద్యోగాలు మాత్రమే ఇవ్వగా, తాము ఇప్పటికే 2.10 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని, మరో 10 వేల పోస్టులకు నోటిఫికేషన్లు కూడా ఇచ్చామని గుర్తుచేశారు.

మంత్రి ఉష శ్రీచరణ్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్‌కు అనంతపురం జిల్లా కల్యాణదుర్గం కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఆమె తరపు న్యాయవాదిలో కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా రీకాల్ చేశారు. శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఆమె ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని 2017 ఫిబ్రవరి 27న బ్రహ్మసముద్రం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీ నిర్వహించారని అప్పటి తహశీల్దార్ ఫిర్యాదు మేరకు మంత్రితో పాటు మరో ఏడుగురు స్థానిక నాయకులపైనా సెక్షన్ 188 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు మంత్రిగానీ, ఆమె తరపు న్యాయవాదులు గానీ ఎవరూ హాజరుకాకపోవడాన్ని కోర్టు తీవ్రంగా పరగణించి బుధవారం నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. ఆమె తరపు న్యాయవాది గురువారం పిటిషన్ దాఖలుచేయగా రీకాల్ చేశారు.

చేనేతల కోసం ప్రత్యేక పాలసీ

- ఆస్తులను తాకట్టు పెట్టడమే జగన్‌కు తెలుసు
- ప్రతి మండలంలో అన్న క్యాంటీన్లు
- ఎన్నికలు ఎప్పుడొచ్చేనా మేము సిద్ధం
- కర్నూలు పర్యటనలో చంద్రబాబు



ఆదోనిలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

' డబ్బులు సంపాదించే మార్గం నాకు తెలుసు. ఆస్తులు తాకట్టు పెట్టే మార్గం జగన్‌కు తెలుసు. పేదవాడు పేదవాడుగా ఉండటానికి వీల్లేదు. ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించి ధనికులను చేయడమే నా లక్ష్యమని ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్నికలు ఎప్పుడు పెట్టినా మేం సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారంలోకి వస్తే చేనేతల కోసం ప్రత్యేక పాలసీ తీసుకొస్తామని తెలిపారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండోరోజు కర్నూలు జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూర్‌లో ఆయన పర్యటించారు. మార్గమధ్యంలో బోరబండ వద్ద నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించారు. ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీలో చేనేతలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తేరు బజారులో బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ప్రజలు తిరగబడితే తనది బాధ్యత కాదని, జగన్ చేసే ప్రతి యాక్షన్‌కి రియాక్షన్ ఉంటుందన్నారు. ఆదోనిలో ఇసుక దొరకడం లేదు గానీ హైదరాబాద్, బెంగళూరులో మాత్రం దొరుకుతుందన్నారు. సాయంత్రం తాడేపల్లి ప్యాలెస్‌కు లారీల్లో డబ్బులు చేరుతున్నాయని ఆరోపించారు. ప్రజల భూమి ఇవాళ ఉంటే.. రేపు ఉంటుందో లేదో అన్న నమ్మకం లేదన్నారు. ఒకే రాజధాని కావాలని ఆదోని ప్రజలు చెబుతున్న విషయం తాడేపల్లి నివాసంలో ఉన్న జగన్ , పేటీఎం బ్యాచ్ చూడాలని హితవు పలికారు. రాష్ట్రంలో పేదలకు ఉపయోగపడే అన్న క్యాంటీన్లు తీసేశారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రతి మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. నాపై కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారని, ప్రజలకు తప్ప తానెవరికీ భయపడబోనని తెలిపారు. టిడిపి అధికారంలో ఉండుంటే రూ.మూడు వేలు పింఛన్ వచ్చేదన్నారు. ఓ వైపు అప్పులు చేస్తూ మరో వైపు రాష్ట్రంలో అన్నింటిపైనా ముఖ్యమంత్రి ఛార్జీల మోత మోగిస్తున్నారని విమర్శించారు. ఈడీ దాడులు చేస్తారనే భయంతోనే వైన్‌షాపుల్లో ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం దందాలు పెరిగిపోయాయన్నారు. ఎపి అంటేనే పెట్టుబడిదారులు భయపడే పరిస్థితిని వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. విశాఖలో 40వేల కోట్లు భూములను వైసిపి నేతలు హస్తగతం చేసుకున్నారని విమర్శించారు. బానకచర్ల రెగ్యులేటర్ కట్టి ఉంటే రాయలసీమకు నీళ్లు వచ్చేవని..టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామన్నారు. జగన్‌ను రాష్ట్రం నుంచి బహిష్కరించే పరిస్థితి వస్తోందన్నారు. ధరల స్థిరీకరణపై పోరాటం చేస్తామని తెలిపారు. నిండు మనసుతో ఆశీర్వదించి.. అసెంబ్లీకి పంపండి. మీ రుణం తీర్చుకుంటాను అని చంద్రబాబు అన్నారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని గెలిపించాలని, వైసిపిని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్, మాజీ ఎమ్మెల్యేలు మీనాక్షి నాయుడు, బివి జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

సిపిఎస్ రద్దు చేయాలని లక్ష సంతకాల సేకరణ

- వినుకొండలో ప్రారంభించిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెబుతున్న జిపిఎస్‌ను అంగీకరించబోమని, 2024 ఎన్నికల్లో 'సిపిఎస్ రద్దు.. ఒపిఎస్ ముద్దు' అంశం రాజకీయ నినాదంగా మారనుందని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పల్నాడు జిల్లా వినుకొండలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడారు. సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు లక్ష సంతకాలు సేకరించి రాష్ట్రపతికి పంపుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మూడున్నర ఏళ్ల వైసిపి పాలనలో ఒక్క డిఎస్‌సి కూడా ఇవ్వలేదని, వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీల విషయంలో ప్రభుత్వం అవలంభిస్తోన్న ఏకపక్ష ధోరణిని విడనాడాలన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, పోలీసులు, డిగ్రీ, జూనియర్ కళాశాల అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు 60 నుండి 62 సంవత్సరాల కాల పరిమితి పెంపును ఎయిడెడ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, గురుకుల ఉపాధ్యాయులు, గ్రంథాలయ శాఖ ఉద్యోగులు, యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులకూ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయ సారధి పాల్గొన్నారు.

భార్యను చంపేసి.. దండలేశాడు !

- గుంటూరు జిల్లాలో ఓ ఉన్మాద భర్త దారుణం

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)



మృతురాలు స్వాతి (ఫైల్‌ఫోటో)

గుంటూరు జిల్లా తెనాలిలో గురువారం దారుణం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ ఉన్మాది..తన భార్యను అతి దారుణంగా హత్య చేసి.. పూల దండలేశాడు. ఆపై పోలీసులకు లొంగిపోయాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తెనాలిలోని నాజరుపేటలో కాకర్ల వెంకటకోటయ్య, స్వాతి (34) దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. స్వాతి ఓ బ్యూటీ పార్లర్ నిర్వహిస్తుండగా, వెంకటకోటయ్య లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వెంకటకోటయ్య మద్యానికి బానిస కావడంతో కాపురంలో కలతలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి వారిద్దరూ గొడపడ్డారు. దీంతో స్వాతి తన పుట్టింటికి వెళ్లారు. గురువారం ఉదయం యథావిధిగా ఆమె పార్లర్‌కు వచ్చారు. మధ్యాహ్న సమయంలో బ్యూటీపార్లర్ వద్దకు వచ్చిన కోటయ్య తన భార్యతో గొడవపడ్డాడు. ఈక్రమంలో కత్తితో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మరణించారు. రక్తమడుగులో ఉన్న భార్య మృతదేహంపై కోటయ్య పూలదండలు కూడా వేశాడు. ఆపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల వెంకటకోటయ్య మద్యం, పేకాటకు అలవాటు పడ్డాడని, స్వాతి పేరు మీదున్న స్థలం అమ్మాలని ఒత్తిడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

దాడులకు 'మార్గదర్శి' ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో 60 ఏళ్లుగా నిజాయితీగా చిట్స్ నిర్వహిస్తోన్న తమ సంస్థ కార్యాలయాలపై సోదాలు నిర్వహించడం కుట్రపూరితమని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఖాతాదారుల నుండి ఫిర్యాదులు లేకున్నా దాడులు చేస్తున్నారని పేర్కొంది. తనిఖీల్లో ఏమి దొరక్కపోవడంతో కోర్టుకు నివేదించేందుకు కల్పిత ఉల్లంఘనలతో ఒక నివేదికను తయారు చేసి దానిపై సంతకాలు చేయాల్సిందిగా తమ సంస్థ మేనేజర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించింది. సివిల్ అంశాలను క్రిమినల్ అంశాలుగా మార్చి తమ సంస్థపై అక్రమ కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని 'మార్గదర్శి' పేర్కొంది.

'జె ట్యాక్స్' వల్లే వల్లే ఆక్వా రంగానికి ఇబ్బంది : కొల్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆక్వా రంగం 'జె ట్యాక్స్' వల్లే ఇబ్బందులపాలవుతోందని టిడిపి నేత, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చిన సీడ్ యాక్టు వల్ల నష్టమే తప్ప ఎటువంటి ఉపయోగం లేదన్నారు. నాణ్యమైన సీడ్ దొరకడం లేదన్నారు. 'జె ట్యాక్స్' కోసం సీడ్ వ్యాపారులపై బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు.

పొగాకు ఉత్పత్తుల నిషేధ నోటిఫికేషన్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి అమరావతి

గుట్కా, పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తుల తయారీ, ప్రచారం, విక్రయం, సరఫరా, పంపిణీలను నిషేధిస్తూ ఆహార భద్రత కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసిన కేసులో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. గురువారం ఇరుపక్షాల వాదలను ముగిశాయి. తీర్పును రిజర్వులో పెడుతున్నట్లు చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు డివిజన్ బెంచ్ ప్రకటించింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం కింద వాటిని నిషేధిస్తూ వెలువడిన నోటిఫికేషన్‌ను పలువురు వ్యాపారులు హైకోర్టులో సవాల్ చేశారు. పొగాకు ఉత్పత్తులు ఆహార భద్రత పరిధిలోకి రావవని వారి వాదన. నోటిఫికేషన్ వల్ల ఎంతోమంది జీవనోపాధి దెబ్బతింటోందని, దానిని రద్దు చేయాలని కోరారు. ప్రజారోగ్య కోణంలో నిషేధం సరైనదేనని ప్రభుత్వం తరఫున ఏజీ ఎస్ శ్రీరామ్ వాదించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పొగాకు ఉత్పత్తులు ఆహార నిర్వచన పరిధిలోకే వస్తాయని, ప్రజారోగ్యం కోసమే నిషేధ ఉత్తర్వులు వెలువడ్డాయని, రిట్లను కొట్టేయాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును తర్వాత చెబుతామని తెలిపింది.

'లైగర్' పెట్టుబడులపై ఆరా

- పూరీ, చార్మీలను ప్రశ్నించిన ఇడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైగర్ సినిమాలో పెట్టుబడులపై ప్రముఖ దర్శక, నిర్మాత పూరీ జగన్నాథ్, నటి చార్మిలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు గురువారం విచారించారు. వీరిద్దరిని హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయంలో 13 గంటల పాటు విచారణ జరిపినట్టు సమాచారం. భారీ బడ్జెట్‌తో నిర్మితమైన లైగర్ సినిమాలో పలువురు ప్రముఖులు భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టారని ఇడికి సమాచారమున్నది. అంతేగాక, మరికొందరు విదేశాల నుంచి కూడా ఈ సినిమాలో పెట్టుబడులు పెట్టారని దర్యాప్తు సంస్థ దృష్టికి వచ్చింది. దీంతో 15 రోజుల క్రితం పూరీ జగన్నాథ్, చార్మీలకు నోటీసులిచ్చి విచారణకు గురువారం హాజరు కావాలని ఆదేశించింది. ఈ మేరకు ఉదయం 8.30 గంటలకే పూరీ, చార్మీలు ఇడి కార్యాలయానికి చేరుకున్నారు. దాదాపు 9.30 గంటల ప్రాంతం నుంచి రాత్రి 8.45 వరకు వీరిద్దరిని ఇడి అధికారులు విచారించారు. వారు తెచ్చుకున్న బ్యాంకు అకౌంటు పత్రాలను, తాము ఇది వరకే సేకరించిన సమాచారాన్ని వారి ఇద్దరి ఎదుట పెట్టి ఇడి అధికారులు విచారించారని తెలిసింది. ముఖ్యంగా, చార్మీ ఖాతాలోకి భారీ ఎత్తున విదేశీ నిధులు రావటం, చార్మీ నిర్వహిస్తున్న నిర్మాణ సంస్థ అకౌంట్లలోకీ అనేక మంది ప్రముఖుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు ట్రాన్స్‌ఫర్ కావటం గురించి ఇడి అధికారులు ప్రశ్నించారని సమాచారం. ఈ సందర్భంగా వీరి అకౌంట్లలోకి డబ్బులు చేరిన వైనంలో మనీలాండరింగ్ చోటు చేసుకున్నట్టు, అలాగే పిఎంఎల్ఎ ఉల్లంఘన జరిగినట్టూ ఇడి అధికారులు గుర్తించినట్టు విశ్వసనీయ సమాచారం. గతంలో డ్రగ్స్ కేసులో పూరీ, చార్మీలను ఇడి విచారించిన విషయం తెలిసిందే. కాగా, తాజాగా లైగర్ సినిమా నిర్మాణం కోసం భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టటం, ఈ పెట్టుబడులు పెట్టినవారిలో కొందరు ప్రముఖులతో పాటు మరికొందరు రాజకీయ నాయకులూ ఉన్నారనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో పూరీ, చార్మిలను విచారించిన ఇడి అధికారులు వీరి సినిమాలో పెట్టుబడులు పెట్టినవారినీ విచారించే అవకాశమున్నట్టు తెలిసింది.

20 నుంచి తెలంగాణ సాహితీ సంబరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్ -2022' ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు (20,21,22 తేదీల్లో) కొనసాగే ఈ ఫెస్ట్‌ను 'పాటకు జేజేలు' పేరిట నిర్వహించబోతున్నారు. ఈ క్రమంలో కవి గాయకుల సమ్మేళనం, సినిమా పాటల్లోని సాహిత్యంపై చర్చా గోష్టులను నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజా వాగ్గేయకారులు, పాటల రచయితలు, కవులు, విమర్శకులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి తెలిపారు. హైదరాబాద్‌లోని ఎస్‌వికెలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పాటలు, వాటి నేపథ్యం, కవుల పరిచయం, అభినందనలు తదితర కార్యక్రమాలను మూడు రోజులపాటు నిర్వహిస్తామని వెల్లడించారు. సినిమా పాటల సాహిత్యంపై పరిశోధకులతో సదస్సులు కూడా నిర్వహిస్తామని తెలిపారు.

ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఫెస్ట్‌ను ప్రారంభిస్తామని వివరించారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ ఫెస్ట్‌కు హాజరై జయప్రదం చేయాలని కవులు, రచయితలు, సాహితీవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో తెలంగాణ సాహితీ ఉపాధ్యక్షులు రాంపల్లి రమేశ్, తంగిరాల చక్రవర్తి, సహాయ కార్యదర్శి సలీమా, ప్రతినిధి అనంతోజు మోహనకృష్ణ, నగర నాయకులు శరత్, రేఖా, ప్రభాకరాచారి పాల్గొన్నారు.

శకుని పాత్ర పోషిస్తున్న జివిఎల్: కెఎస్ జవహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు శకుని పాత్ర పోషిస్తున్నారని మాజీ మంత్రి కెఎస్ జవహర్ ఒక ప్రకటనలో విమర్శించారు. బిజెపి గురించి మాట్లాడకుండా చంద్రబాబుపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొత్తు పొసగుతుందని జగన్ కంటే జివిఎల్ ఎక్కువ ఆందోళనలో ఉన్నారని విమర్శించారు. దక్షిణాదిలో వారి బలం తెలిసి కూడా ఇలా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. జగన్‌కు ఏజెంట్‌గా జివిఎల్ ఉన్నారని విమర్శించారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన ప్రయోజనాల గురించి మాట్లాడాలని సూచించారు. ఐక్య పోరాటాలకు విఘాతం కల్గించే విధంగా జివిఎల్ ప్రకటనలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా వైసిపి పాలనలో నల్లధనం ఎగుమతుల్లో రాష్ట్రమే మొదటిస్థానంలో ఉందని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. వైసిపి నేతలు రాష్ట్రంలో కొల్లగొట్టిన అవినీతి సొమ్మును ప్రైవేట్ విమానాల ద్వారా విదేశాలకు తరలిస్తున్నారని ఆరోపించారు.

చంద్రబాబుకు 2024 ఎన్నికలే చివరివి : మంత్రి సీదిరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు ఎన్ని కుప్పిగంతులు వేసినా 2024 ఎన్నికలే చివరి ఎన్నికలవుతాయని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారంనా డు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు కర్నూలుకు హైకోర్టు రాకుండా అడ్డుపడుతూ అదే కర్నూలుకు వెళ్లి తాను వస్తే అభివృద్ధి చేస్తాననడం ప్రజలను మోసం చేయడమేనని మంత్రి అన్నారు. వైఎస్ జగన్ సంక్షేమపాలన ముందు టిడిపికి 2024లో సమాధి కట్టడం ఖాయమన్నారు. తన ఓటమిని ఏడాదిన్నర ముందే గ్రహించి 2024 ఎన్నికలే తనకు చివరివి అని చంద్రబాబే అంగీకరించారని అన్నారు. సానుభూతి కోసం తనకుటుంబ సభ్యులను కూడా వీదిలోకి లాగే సంస్కృతి చంద్రబాబునాయుడిదని విమర్శించారు. ప్రజలు టిడిపికి పూర్తిగా దూరమయ్యారనే పొత్తుల కోసం తహతహలాడుతున్నారని విమర్శించారు.

మెటా ఇండియా బాస్‌గా సంధ్య



న్యూఢిల్లీ : ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ఇండియా హెడ్‌గా సంధ్యా దేవనాథన్ నియమితులయ్యారు. మెటా భారత వైస్ ప్రెసిడెంట్‌గా కూడా ఆమె బాధ్యతలను కలిగి ఉంటారు. దేవనాథన్ కొత్త బాధ్యతలను 2023 జనవరి 1 నుంచి చేపట్టనున్నారని మెటా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మార్నే లెవిన్ వెల్లడించారు. వ్యాపార నిర్వహణ, టీమ్ మేనేజ్‌మెంట్, కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలో సంధ్య దేవనాథన్‌కు ఉన్న అనుభవం భారత్‌లో బలపడేందుకు మరింత తోడ్పడుతుందని లెవిన్ పేర్కొన్నారు. ఇటీవల మెటా ఇండియా హెడ్ అజిత్ మోహన్ రాజీనామా చేయడంతో సంధ్యాకు బాధ్యతలు అప్పగించనున్నారు. నూతన పదవి బాధ్యతలను స్వీకరించేందుకు సంధ్యా దేవనాథన్ త్వరలోనే ఇండియాకు రానున్నారు. ప్రస్తుతం మెటా ఆసియా-పసిఫిక్ డిజిటల్ గేమింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. అంతక్రితం ఆమె మెటా సింగపూర్ ఎండి, మెటా వియత్నాం బిజినెస్ హెడ్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2016 నుంచి మెటాలో పనిచేస్తున్నారు. 2000లో ఢిల్లీ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఫ్యాకల్టీ నుంచి ఎంబిఎ పూర్తి చేశారు. బ్యాంకింగ్, పేమెంట్లు, టెక్నాలజీ రంగాల్లో 22 ఏళ్ల అంతర్జాతీయ అనుభవం ఉంది. ఇటీవలే మెటా ఇండియా పబ్లిక్ పాలసీ హెడ్ శివనాథ్ తుక్రాల్‌ను కంపెనీ నియమించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి కీలక సోషల్ మీడియాలకు మెటా మాతృసంస్థగా ఉంది. ఇటీవల మెటాలో భారీగా ఉద్యోగుల తొలగింపులు చేపట్టిన విషయం తెలిసిందే.

ఎక్కువ గంటలు పని చేయాల్సిందే: మస్క్

న్యూఢిల్లీ : ట్విటర్‌లో పని చేసే ఉద్యోగులకు ఆ సంస్థ బాస్ ఎలన్ మస్క్ కఠిన షరతులు పెడుతున్నారు. ట్విటర్‌ను స్వాధీనం చేసుకున్న వారం రోజుల్లోనే సగం మంది ఉద్యోగులను తీసేసిన మస్క్.. ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నారు. చాలా తీవ్రంగా పనిచేస్తారా లేక నిష్క్రమిస్తారా తేల్చుకోవాలంటూ ఉద్యోగులకు ఈ మెయిల్ సమాచారం ఇచ్చారు. సంస్థ సంస్థాగత పునర్నిర్మాణంలో భాగంగా తీవ్ర ఒత్తిడితో, ఎక్కువ గంటలు పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లేదంటే వెళ్లిపోవడానికి అంగీకరించాలన్నారు.

ముంచుకొస్తున్న డిసెంబర్ 21 గడువు

- ఒక్క విద్యుత్ కనెక్షనూ ఇవ్వని వైనం
- సరైన రోడ్లు లేక అల్లాడుతున్న జగనన్న కాలనీలు



ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ఈ చిత్రం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తిమ్మోజిపల్లి లోనిది. ఇక్కడ ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీలో 70 ఇళ్లు ఇచ్చారు. ఇందులో దాదాపు 20 పూర్తయ్యాయి. నీటి కోసం బోరు అయితే వేశారు గాని కరెంటు కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు.

సరైన రోడ్డు సదుపాయం లేకపోవడం వల్ల నత్తనడకన ఇంటి నిర్మాణ పనులు సాగుతున్నాయి.

ఇది ఒక్క తిమ్మోజి పల్లిలోనే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి. తాము కాలనీలను కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వానికి వాటిల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలనే ఆలోచన లేకపోవడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 15.58 లక్షల ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది. వీటిల్లో 13.66 లక్షల ఇళ్లకు రిజిస్టర్ చేసింది. ఇందులో 1.33 లక్షల ఇళ్ళు మాత్రమే పూర్తయ్యాయి. బేస్‌మెంట్ లెవల్ కన్నా ఎక్కువ ఉన్న గృహాలు వివిధ దశల్లో 5.62 లక్షలున్నాయి. డిసెంబర్ 21వ తేదీ నాటికి నాలుగు లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు నిర్వహించాలని అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. కాని మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది.

విద్యుత్ లేక అవస్థ

ప్రతి లే అవుట్‌లో బోరు వేశారు. కాని విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం మరిచారు. లే అవుట్ వేసినప్పుడు ఏర్పాటు చేసిన మట్టిరోడ్లే ఇంకా ఉన్నాయి. వర్షాలకు ఈ రహదారులు బురదమయంగా మారుతున్నాయి. నిర్మాణ సామగ్రి తెచ్చుకునేందుకు లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడు తున్నారు. గృహాలకు సామగ్రి తెచ్చేందుకు ట్రాక్టర్లు రావాలంటే భయపడి పోతున్నారు. ఒక వేళ వచ్చినా అదనంగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వక పోవడం వల్ల అన్ని పనులకూ ఇబ్బందులు ఎదురవు తున్నాయని లబ్ధిదారుడు హేమచంద్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

- ఒపి భవన ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



ఒపి బ్లాక్‌ను ప్రారంభిస్తున్న అంజాద్‌బాషా, ఎంపి ,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా తెలిపారు. నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.5 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఒపి బ్లాక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం మరో రూ.ఐదు కోట్లు కేటాయించి పనులు చేయిస్తున్నామన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశామని, ఆ పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. వచ్చే ఏడాదికి 150 మంది విద్యార్థులతో మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పాటైన ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. గర్భిణుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని నూతనంగా ఒపి బ్లాక్‌ను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానిసామూన్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా పరిశ్రమలపై విజిలెన్స్ దాడులు దారుణం : గఫూర్

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమగోదావరి)



సంక్షోభంలో ఉన్న ఆక్వా పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ దాడులు చేయించడం దారుణమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ అన్నారు. ఈ దాడులు కేవలం ఎన్నికల ఆర్థిక ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరుగుతున్న సిఐటియు జిల్లా మహాసభకు విచ్చేసిన ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. దాడుల వల్ల కొనుగోళ్లు నిలిచి పరిశ్రమలు మూతబడతాయని, కార్మికులకు పని లేకుండా పోతోందని అన్నారు. ఈక్విడార్‌లో ఆక్వా ఉత్పత్తి పెరగడం వల్ల మనదేశం నుంచి అమెరికా, యూరప్‌లకు ఎగుమతులు తగ్గాయన్నారు. అలాగే చైనాతో సంబంధాలు తగ్గడం వల్ల ఎగుమతులు తగ్గాయని చెప్పారు. ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ దాడులు చేయడం దుర్మార్గమన్నారు. కోల్డ్ స్టోరేజీలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రొయ్యలను ఎలా కొనుగోలు చేస్తుందని ప్రశ్నించారు. చేతిలో అధికారం ఉందని పరిశ్రమ, రైతులకు విద్యుత్తు సరఫరా తొలగించడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆక్వా పరిశ్రమ లాభాల్లో ఉన్నప్పుడు కార్మికుల వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు.

అధ్యాపకురాలిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధ్యాపకురాలపై ఆమె భర్త కత్తితో దాడికి పాల్పడిన సంఘటన అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతోనే ఈ దాడి జరిగినట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు ఎయిడెడ్ కళాశాలలో సుమంగళి అనే అధ్యాపకురాలు కామర్స్ విభాగంలో పని చేస్తున్నారు. బదిలీపై అనంతపురం ఆర్ట్స్ కళాశాలకు వచ్చారు. ఇక్కడికి వచ్చాక సుమంగళి, ఆమె భర్త పరేష్‌కు మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఆమె విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు.

ఆరు మాసాలుగా ఇద్దరూ విడివిడిగా ఉంటున్నారు. సుమంగళి అనంతపురం శ్రీనివాసనగర్‌లో ఉండగా, పరేష్ విద్యుత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. రోజూ మాదిరిగానే గురువారం కళాశాలకు వచ్చిన సుమంగళి హాజరు వేసి బయటకు వస్తుండగా అక్కడే కాపు కాచిన పరేష్ ఆమెపై కత్తితో దాడి చేశాడు. గొంతు, ముఖంపై తీవ్రంగా గాయపరిచాడు. అక్కడున్న విద్యార్థులు పరేష్‌ను అడ్డుకున్నారు. గాయపడిన ఉపాధ్యాయురాలికి రక్షణగా నిలబడి ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. నిందితుడిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే దాడి చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

26 మంది విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి-వీరబల్లి (అన్నమయ్య జిల్లా)

కలుషిత ఆహారం తిని 26 మంది బాలికలు అస్వస్థతకు గురైన సంఘటన అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం చోటు చేసుకుంది. కడుపునొప్పి, విరేచనాలు, వాంతులతో విద్యార్థులు బాధపడుతుండటంతో వారిని ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరికి సీరియస్‌గా ఉండడంతో ఒకరిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి, మరొకరిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి, డిఇఒ రాఘవరెడ్డి, ఇతర అధికారులు కలిసి కెజిబివికి వెళ్లి వివరాలు సేకరించారు. బియ్యం, పాలు, గుడ్లు, కూరగాయలు, వాటర్, కిచెన్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాల వల్ల ఫుడ్ పాయిజన్ అయినట్లు వారు గుర్తించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, లేకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థులకు ఇచ్చే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో విద్యార్థులు నిరంతరం ఫుడ్ పాయిజన్ బారిన పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు పేర్కొన్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను తహశీల్దార్ తులశమ్మ, ఎంఇఒ గిరివరదయ్య, ఇఒపిఆర్‌డి సురేష్‌బాబు, సిఐ లింగప్ప, ఆర్ఐ గోపి, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు.

టిడిపి నేత శేషగిరిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-కోటనందూరు (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా తుని పట్టణంలో టిడిపి సీనియర్ నేత, మాజీ ఎంపిపి పొల్నాటి శేషగిరిపై హత్యాయత్నం జరిగింది. నిందితుడు భవాని మాల వేషధారణలో గురువారం ఉదయం శేషగిరి ఇంటికి వచ్చాడు. భిక్ష తీసుకుంటున్నట్లుగా నటించి ఒక్కసారిగా ఆయనపై కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనలో శేషగిరి చేతులు, తలకు గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. శేషగిరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎఎస్‌పి శ్రీనివాస్ తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, డాగ్ స్క్వాడ్, సిసి పుటేజ్ ఆధారంగా నిందితుని కోసం గాలిస్తున్నామని ఎఎస్‌పి చెప్పారు. దాడి విషయం తెలుసుకున్న వెంటనే టిటిడి సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు ఆసుపత్రికి చేరుకుని శేషగిరి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శేషగిరి

తీవ్రంగా ఖండించిన అచ్చెన్నాయుడు

పోల్నాటి శేషగిరిరావుపై స్థానిక ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా అనుచరులే దాడి చేశారని, ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్యాయాలను నిలదీసే టిడిపి నేతల గళాలను అణిచివేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శేషగిరిరావుపై జరిగిన దాడిని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, దాడికి పాల్పడిన రౌడీ మూకలను, వారి వెనుకున్నవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

- పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఎస్ సురేష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలల్లో విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమీషనర్, ఎస్‌పిడి ఎస్ సురేష్ కుమార్ అన్నారు. గురువారం నాడు సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర కార్యాలయంలో 66వ అండర్ 14, 17, 19 జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శుల వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులకు కనీసం రెండు ఆటల్లో శిక్షణ ఇచ్చి మంచి క్రీడాకారులను తయారు చేయాలన్నారు. క్రీడల్లో ఆసక్తిగల విద్యార్థులను గుర్తించి వారికోసం పాఠశాల తరగతుల అనంతరం ప్రతి రోజూ రెండు గంటల సమయం అదనంగా కేటాయించాలని అన్నారు. ఖేలో ఇండియా ఫిట్ నెస్ యాప్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలన్నారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శుల పదవిలో మహిళా పిఇటిలకు 33 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో అండర్ 14, 17, 19 అంతర్ జిల్లాల బాలబాలికల పోటీలను డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా అంతర్ జిల్లాలు, జాతీయ స్థాయి పోటీలు క్రీడల నిర్వహణ మార్గదర్శకాలతో కూడిన పుస్తకాన్ని సురేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్షా అదనపు సంచాలకులు బి శ్రీనివాసరావు, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు పి పార్వతి, పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం గారు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ సెక్రటరీ జి భానుమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో లంపిస్కిన్

మృత్యువాత పడుతున్న మూగజీవాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు జిల్లా ఏలూరు రూరల్ మండల పరిధిలోని ఆవులకు లంపి స్కిన్ వైరస్ సోకింది. మండలంలోని చొదిమెల్ల గ్రామంలో ఈ వైరస్ వల్ల ఇప్పటికే నాలుగు ఆవులు మృత్యువాతపడ్డాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న చాలా ఆవులు వైరస్ బారిన పడ్డాయని తెలిపారు. పశువులకు జ్వరం రావడంతోపాటు చర్మంపై గడ్డలు, కళ్లు, ముక్కు నుంచి నీరు కారుతున్నాయని చెప్పారు. చర్మంపై గుండ్రని గడ్డలు ఏర్పడుతున్నాయని, పశువులు సరిగ్గా నడవలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సంపాదకీయం

ప్రమాద ఘంటికలు!

దేశ వాణిజ్య లోటు ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. భారత్ నుండి ఎగుమతులు భారీగా పడిపోవడం, మరోవైపు దిగుమతులు పెరగడంతో లోటు ఎగిసి పడుతోంది. ఈ అక్టోబర్ నెలలో సరుకుల ఎగుమతులు 16.65 శాతం పతనమై 29.75 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. దిగుమతులు 5.7 శాతం పెరిగి 56.69 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఈ పరిణామాలతో అక్టోబర్ నెలలో భారత వాణిజ్య లోటు 26.91 బిలియన్ డాలర్లకు (రూ.2.17 లక్షల కోట్లు) ఎగిసింది. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానం ఎగుమతులను దెబ్బతీస్తుందన్న నిపుణుల హెచ్చరికలు నిజమని రుజువవుతున్నాయి. అక్టోబర్‌లో వజ్రాలు, ఆభరణాలు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, రడీమేడ్ దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, తోలు ఉత్పత్తుల వంటివాటి ఎగుమతులు తగ్గిపోయాయి. అంతర్జాతీయ విపణిలో మనం చేసే ప్రధానమైన ఉత్పత్తుల ఎగుమతిలోనే అంత తరుగుదల రావడం ప్రమాదకర సంకేతం. మరోవైపున ఎప్పటికన్నా ఎక్కువగా చమురు దిగుమతి జరిగింది. అంతకుముందు నెలతో పోల్చితే ఏకంగా 29.1 శాతం పెరిగిందంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అంతర్జాతీయ వాణిజ్యం కుదించుకుపోతుందని ప్రపంచ వాణిజ్య సంస్థ హెచ్చరికల నేపథ్యంలో భారత్ ఎగుమతి దిగుమతుల విషయంలో మరింత జాగరూకత అవసరం.

గడచిన మూడు నాలుగు నెలలుగా రూపాయి విలువ పడిపోతూనే ఉంది. రూపాయి చరిత్రలోనే అత్యంత కనిష్టంగా ఈ అక్టోబర్ నెలలో అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 83.20కి క్షీణించింది. అయితే తరువాత బలపడుతుందని ఊరడింపులు చేస్తున్నా మళ్లీ నవంబర్ 17న అమాంతం 38 పైసలు కోల్పోయి, డాలర్‌కు 81.84 రూపాయల మారక విలువకు పడిపోయింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది. ఉక్రెయిన్ యుద్ధం అనంతరం ఒపెక్ దేశాలు చమురు వెలికితీతకు కోతలు విధించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరల్లో తీవ్ర అనిశ్చితి ఏర్పడింది. మన దేశ అవసరాల్లో 80 శాతం చమురును దిగుమతి చేసుకుంటున్నాం. చమురు ధరలు అమాంతం పెరిగిపోతే ఇంధన వ్యయం, రవాణా ఖర్చు పెరిగి, అన్నిటి ధరలూ ఆకాశానికి ఎగబాకుతాయి. కోవిడ్ నేపథ్యంలో ఉపాధి, ఆదాయాలు కోల్పోయిన ప్రజలకు కష్టాలు మరింత పెరుగుతాయి. ఇంకోవైపున ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయాలన్న పేరుతో బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచుతాయి. అందువల్ల గృహ నిర్మాణానికో లేక ఇతర అవసరాలకో బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న వారికి పెను భారమవుతుంది. విదేశీ వాణిజ్య లోటు పెరగడంతోపాటు ఖజానాకు ద్రవ్య లోటు కూడా పెరుగుతుంది.

భారత ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడుతోందని, మరోవైపు అమెరికా, ఐరోపా బ్యాంకుల వడ్డీ రేట్లు పెరుగుతున్నందున ఈ దేశంలోని పెట్టుబడులు మరింతగా వెనక్కు తీసుకుపోతారు. సెప్టెంబర్ నెలలోనే విదేశీ సంస్థాగత పెట్టుబడులు 700 కోట్ల డాలర్లకు పైగా ఇతర దేశాలకు వెళ్లిపోయాయి. ఆ వేగం ఇంకా పెరగవచ్చు. రూపాయి మరింతగా బలహీనపడుతుందన్నది విశ్లేషకుల మాట. ఏ దేశంలోనైనా కరెన్సీ విలువ తరగడం, ద్రవ్యోల్బణం పెరగడం జరిగితే అక్కడ విదేశీ పెట్టుబడులు నిలవవని ప్రపంచ అనుభవం చెబుతోంది. కాబట్టి ఇదో విష చక్రం. పర్యవసానంగా రూపాయి విలువ మరింత దిగజారడం, దేశంలో ధరలు పైపైకి పెరగడానికే దారి తీస్తుంది. ఈ దుస్థితి మారాలంటే ప్రభుత్వ ఆర్థిక విధానాలు మారాలి. దేశీయ ఉత్పత్తి పెరగడంతోపాటు ఆ సరుకుల్ని వినిమయం చేసేంతగా ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. అంతర్గత ఆర్థికాభివృద్ధి కీలకం. అందుకు అనువైన ఆర్థిక విధానాలను ప్రభుత్వాలు అమలు చేయాలి. కాని, మోడీ ప్రభుత్వం తనంతట తాను అందుకు పూనుకోదు కనుక ప్రజా ఉద్యమాలతో ఒత్తిడి తీసుకురావాలి. అదే మన ముందున్న మార్గం.

మహనీయుల మాట



మనం చీకట్లో వున్నామనే
భావన కలిగినప్పుడు
వెలుతురు వైపు
చూసే ప్రయత్నం చేయాలి.
- అరిస్టాటిల్

కామెంట్

ఎన్నికల కమిషన్‌ను సంస్కరించాల్సిందే

ఇటీవల కాలంలో భారత ఎన్నికల కమిషన్ (ఇ.సి) తీసుకున్న కొన్ని చర్యలు, అనుసరించిన వైఖరులు... స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించే పర్యవేక్షకురాలిగా, నిష్పక్షపాత మధ్యవర్తిగా తనకు గల పేరు ప్రతిష్టలను దెబ్బతీసేలా వున్నాయి. గత కొన్నేళ్ళుగా, ముఖ్యంగా మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అయిష్టంగానైనా సరే ఇ.సి వ్యవహరించడం కనిపిస్తోంది. పైగా గతంలో తాను తీసుకున్న కొన్ని స్వతంత్ర వైఖరుల నుండి కూడా వెనుకంజ వేస్తోంది.



> ఎన్నికల కమిషన్ అనేది మన ప్రజాస్వామ్యానికి చాలా విలువైన, కీలకమైన సంస్థ. నిరంకుశ ప్రభుత్వం...ఈ సంస్థ స్వేచ్ఛను, సమగ్రతను నిర్మూలించడాన్ని ఎంత మాత్రమూ అనుమతించలేం. ఎన్నికల కమిషన్‌లో సంస్కరణలు తీసుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. ముందుగా, ఎన్నికల కమిషనర్ల ఎంపిక ఒక కమిటీ ద్వారా జరగాలి. ఆ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా వుండాలి. ఇప్పుడు ఇ.సి కమిషనర్ల ఎంపిక పూర్తిగా ప్రభుత్వం చేతుల్లోనే వుంటోంది. ఇక రెండోది, పదవీ విరమణ చేసిన తర్వాత, కమిషనర్ ఎలాంటి అధికారిక పదవిని చేపట్టరాదు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఈ దురదృష్టకరమైన ధోరణిని ప్రముఖంగా ప్రస్తావిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉచితాలు ఇస్తామంటూ చేసే హామీలు, వాగ్దానాలనేవి తమ పరిధిలోకి రావంటూ ఇ.సి సుప్రీం కోర్టులో గతంలో తన వైఖరి స్పష్టం చేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి చేసే ఏ ప్రయత్నమైనా కూడా తమ అధికారాలను ఉల్లంఘించి వ్యవహరించడమే అవుతుందని పేర్కొంది.

ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎలాంటి మినహాయింపులు లేని రీతిలో ఎన్నికల కమిషన్ తీసుకున్న ఈ వైఖరిని – జులైలో ప్రధాని మోడీ 'రేవడి' సంస్కృతిపై తీవ్రంగా ధ్వజమెత్తి, ప్రజలకు ఉచితాలు ఇస్తున్నారంటూ ప్రతిపక్షాలపై విమర్శలు చేసిన వెంటనే మార్చుకుంది. ఎన్నికల నిబంధనావళిని సవరించాలని ఆలోచిస్తున్నామని, రాజకీయ పార్టీలు చేసే ఎన్నికల వాగ్దానాలు, వాటి ఆర్థిక పర్యవసానాల వివరాలను వెల్లడించే ప్రొఫార్మాను ప్రవేశపెట్టాలనుకుంటున్నామంటూ రాజకీయ పార్టీలకు ఇ.సి అక్టోబర్‌లో తెలియచేసింది. పైగా, రాజకీయ పార్టీలు తాము ఇచ్చే హామీలను నెరవేర్చేందుకు అవసరమయ్యే అదనపు వనరులను ఎలా సమీకరిస్తారో కూడా తెలియచేయాల్సి వుంటుందని పేర్కొంది. ఈ రీతిలో ప్రజలకు రాజకీయ పార్టీలు ఇచ్చే హామీల విషయంలో జోక్యం చేసుకోవడమనేది...విజ్ఞతతో కూడిన ఆర్థిక సుస్థిరత పరిధిలో రాజకీయ పార్టీ విధానాన్ని నియంత్రించే ప్రయత్నమే. ఇటువంటి ఎన్నికల వాగ్దానాలను సమీక్షించాల్సిన పని ఇ.సి కి లేదు. కానీ, ఇటువంటి చర్య తీసుకోవడం ద్వారా, కొద్ది మాసాల క్రితం సుప్రీం కోర్టులో తాను తీసుకున్న వైఖరికి పూర్తి భిన్నంగా, ప్రధాని ఆదేశాలను నెరవేరుస్తున్నారన్న ఆరోపణలను మూటగట్టుకునే రీతిలో ఇ.సి వ్యవహరించింది.

ప్రభుత్వం మొదటిసారిగా ప్రతిపాదించిన ఎన్నికల బాండ్ల పథకానికి వ్యతిరేకంగా ఇ.సి నిర్ద్వంద్వంగా తన వైఖరిని తెలియచేసింది. ఎలాంటి పారదర్శకత లేని ఈ వ్యవస్థ గురించి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, ఇటువంటి అజ్ఞాత నిధులు, విరాళాలు స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికల నిర్వహణను ఎలా దెబ్బతీస్తాయో తెలియచేసింది. 2018 లోనే ఇది చెప్పింది. అప్పటి నుండి, ఈ విషయం ఎప్పుడు సుప్రీంకోర్టుకు వచ్చినా, ఎన్నికల బాండ్లకు వ్యతిరేకంగా పిటిషన్లను విచారిస్తున్నా ఇ.సి దీనిపై తీవ్రంగా వ్యవహరించలేదు.

ఎన్నికల్లోకి అజ్ఞాతంగా వచ్చిపడే నిధుల ప్రవాహాన్ని ఎలా అడ్డుకోవాలనేది తీవ్రంగా ఆలోచించడానికి బదులుగా, రాజకీయ పార్టీలు అందుకునే చిన్న మొత్తాల విరాళాలను ఎలా కనిపెట్టాలంటూ ఇ.సి మరింతగా ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం, రూ.20 వేలకు పైబడిన విరాళాలకు రాజకీయ పార్టీలు మూలం ప్రకటించాలని చట్టం పేర్కొంటోంది. అయితే, రూ.2 వేలకు పైబడిన విరాళాలు వచ్చినా వాటిని కూడా ప్రకటించేలా ఈ చట్టాన్ని సవరించాలని సెప్టెంబర్‌లో న్యాయశాఖా మంత్రికి ఇ.సి లేఖ రాసింది. రూ.2 వేల కన్నా తక్కువ మొత్తంలో అజ్ఞాతంగా వచ్చిన విరాళాలపైనా ఆంక్షలు విధించాలని ఇ.సి భావిస్తోంది. కానీ, ఎన్నికల బాండ్ల ద్వారా అజ్ఞాతంగా వచ్చే కోట్లాది రూపాయల విరాళాలపైన ఎన్నికల కమిషన్ అస్సలు ఆందోళన చెందకపోవడం విచారకరం. ఈ అక్టోబర్‌లో 22వ విడత ఎన్నికల బాండ్లను జారీ చేసిన తర్వాత మొత్తంగా రూ.10,791 కోట్లు ఈ అజ్ఞాత మార్గం ద్వారా వచ్చిపడ్డాయి. ఇందులో పెద్ద వాటా పాలక పార్టీదే.

ఏడాదిలో నాలుగుసార్లు జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబరుల్లో 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు ఎన్నికల బాండ్లు జారీ చేస్తారు. అయితే ఈ ఏడాది అక్టోబరులో చివరి విడత తర్వాత మోడీ ప్రభుత్వం నిబంధనలను సవరించింది. నవంబరు 8న అదనంగా మరోసారి ఎన్నికల బాండ్లు జారీ చేసి 15 రోజుల పాటు అమలయ్యేలా చూసింది. డిసెంబరు మొదటి వారంలో గుజరాత్ ఎన్నికలు జరగనున్నందున వాటిని దృష్టిలో పెట్టుకుని నిబంధనలకు ఈ సవరణ చేసింది. పాలక పార్టీకి విధేయంగా వుండడానికి సదా సన్నద్ధంగా వుండే కార్పొరేట్లు, చీకటి వ్యాపారుల నుండి పెద్ద మొత్తంలో నిధులు సమీకరించగలమని సహజంగానే బిజెపి ఆశతో వుంది.

ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేయకుండా...ఎన్నికల కోసం ఉద్దేశించిన లెక్కలోకి రాని నగదు వినియోగంపై ఎలాంటి కట్టడి వుండదు. అయితే, రూ.2 వేలు వంటి చిన్న మొత్తాలు, అంతకు పైబడిన విరాళాలను జవాబుదారీగా చేయడంతోనే ఇ.సి సంతృప్తి చెందుతోంది.

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో కొత్త ప్రామాణికాలను కూడా ఇ.సి ప్రవేశపెట్టింది. మొదటగా, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రకటన తర్వాత చాలా ఆలస్యంగా గుజరాత్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. గుజరాత్‌లో పలు ప్రాజెక్టులను ప్రారంభించేందుకు, పథకాలను అమలు చేసేందుకు ప్రధాని ఈ అదనపు సమయాన్ని ఎలా ఉపయోగించారో ప్రతి ఒక్కరూ చూశారు.

ఇక రెండో అసాధారణమైన చర్య ఏమిటంటే, తమ సంస్థల్లో పని చేసే కార్మికులు ఎన్నికల్లో పాల్గొనే రీతిని, వారి భాగస్వామ్యాన్ని పర్యవేక్షించేందుకు గుజరాత్ లోని వెయ్యికి పైగా కార్పొరేట్ సంస్థలతో ఎన్నికల కమిషన్ అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఓటు వేయని వారి పేర్లను సంస్థ వెబ్‌సైట్లు లేదా నోటీసు బోర్డుల్లో ప్రచురించడం. అంటే ఇది, బలవంతంగానైనా ఓటింగ్‌లో పాల్గొనేలా చూసే ప్రమాదకరమైన చర్యకు దగ్గరగా వుంది. దీంతో తమ సంస్థల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు అందరూ తప్పక ఓటు వేసేలా చూసే బాధ్యత ఇప్పుడు ఆయా సంస్థలు, కంపెనీల యాజమాన్యాలపై వుంది. ఇక ఓటు ఎలా వేయాలో వారికి సలహా ఇవ్వడమే తదుపరి చర్య కాగలదు.

ఎన్నికల కమిషన్ అనేది మన ప్రజాస్వామ్యానికి చాలా విలువైన, కీలకమైన సంస్థ. నిరంకుశ ప్రభుత్వం...ఈ సంస్థ స్వేచ్ఛను, సమగ్రతను నిర్మూలించడాన్ని ఎంత మాత్రమూ అనుమతించలేం. ఎన్నికల కమిషన్‌లో సంస్కరణలు తీసుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. ముందుగా, ఎన్నికల కమిషనర్ల ఎంపిక ఒక కమిటీ ద్వారా జరగాలి. ఆ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా వుండాలి. ఇప్పుడు ఇ.సి కమిషనర్ల ఎంపిక పూర్తిగా ప్రభుత్వం చేతుల్లోనే వుంటోంది. ఇక రెండోది, పదవీ విరమణ చేసిన తర్వాత, కమిషనర్ ఎలాంటి అధికారిక పదవిని చేపట్టరాదు. పార్లమెంటుకు లేదా అసెంబ్లీకి సభ్యులుగా వీరిని రాజకీయ పార్టీలు నామినేట్ చేయరాదు.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

విభేదాల ప్రతిబింబం జి20 ప్రకటన

కొంచెం కారం, కొంచెం తీపి, కొంచెం చేదు అన్నట్లుగా నవంబరు 15-16 తేదీల్లో ఇండోనేషియా లోని బాలిలో జరిగిన జి20 శిఖరాగ్ర సమావేశ ప్రకటన ఉంది. వర్తమాన ప్రపంచ విభేదాలను ప్రతిబింబిస్తూ పదిహేడు పేజీల పత్రం తమ ఎత్తుగడలు, వ్యూహం, రాజకీయాలకు అనుగుణంగా ఎవరికి వారు భాష్యం చెప్పుకొనేందుకు వీలుగా ఉందని చెప్పవచ్చు. పందొమ్మిది దేశాలూ, ఐరోపా సమాఖ్యలతో ఉన్న ఈ బృందం అంతర్ ప్రభుత్వాల వేదిక. ప్రపంచ ఆర్థిక రంగానికి సంబంధించి ద్రవ్య స్థిరత్వం, వాతావరణ మార్పులను పరిమితం గావించటం, నిరంతర అభివృద్ధి సంబంధింత అంశాల మీద పని చేస్తున్నది. ప్రపంచ భద్రతా సమస్యల చర్చకు వేదిక కానప్పటికీ కొన్ని దేశాల ఒత్తిడి మేరకు ప్రస్తుతం కొనసాగుతున్న ఉక్రెయిన్ సంక్షోభం మీద కూడా బాలి శిఖరాగ్ర ప్రకటనలో ప్రస్తావించారు. ప్రధాన నేతలలో వ్లదిమిర్ పుతిన్ ఈ సభకు రాలేదు. రష్యాకు వ్యతిరేకంగా అమెరికా-ఐరోపా సమాఖ్య ఒక వైపు, రష్యాను సమర్థించే దేశాలు మరోవైపు, తటస్థ చైనా, భారత్‌లు ఈ కూటమిలో భాగస్వాములు. వీటి మధ్య తీవ్ర విభేదాల పూర్వరంగంలో అసలు ఒక ప్రకటన చేస్తారా అన్న సందేహాలు తొలుత వెలువడినప్పటికీ రష్యా నిరసన మధ్య ఎట్టకేలకు వెలువడింది.

సందిగ్ధానికి తావులేకుండా ఉండాలని కొన్ని దేశాలు డిమాండ్ చేసిన కారణంగా ఎక్కువ మంది సభ్యులు ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఖండించినట్లు బాలి ప్రకటనలో పేర్కొన్నారు, మిగిలిన వారు ఆ వైఖరికి దూరంగా ఉన్నట్లు ఈ పదజాలం స్పష్టం చేసింది. ఇది యుద్ధాల యుగం కాదని షాంఘై సహకార సంస్థ సమావేశాల్లో భారత ప్రధాని మోడీ అన్న మాటలను కూడా ఈ ప్రకటనలో చేర్చారు. ప్రపంచ ఆహార కార్యక్రమానికి విరాళంగా ఇచ్చిన ఎరువులు, నల్లసముద్రంలో ఆహార ధాన్యాల నడవా ఏర్పాటు గురించి కూడా పేర్కొని రష్యాను సంతృప్తిపరచేందుకు చూశారు. సంఘర్షణలు మానవాళికి ముప్పు కలిగిస్తాయంటూ సమావేశం ఆందోళన వ్యక్తంచేసింది. ప్రపంచ గోధుమ, ఎరువుల మార్కెట్లను స్థిరీక రించేందుకు తమకు తగినంత సామర్థ్యం ఉందని తమ మీద అక్రమంగా ఆంక్షలను విధించి ఆటంకాలను కలిగించినప్పటికీ ఇప్పటికే 105 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను ఎగుమతి చేశామని, వాటిలో 60 శాతం ఆసియా, 40 శాతం ఆఫ్రికా ఖండానికి పంపినట్లు ఈ సమావేశాల్లో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావరోవ్ ఉద్ఘాటించారు. ఈ విషయంలో పశ్చిమ దేశాలు దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు.


ఈ సమావేశాలలో పాల్గొన్న నేతలు ఎడముఖం పెడముఖంగా ఉండటం కూడా ప్రపంచం గమనించింది. చైనా తమ ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా మారిందన్న బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఈ సమావేశాల్లో మాట్లాడుతూ...ముప్పు బదులు సవాళ్లను విసురుతున్నదని సవరించుకోవాల్సి వచ్చింది. చైనా అధినేత సీ జిన్‌పింగ్-రిషి ఈ సమావేశాల సందర్భంగా విడిగా భేటీ అవుతారని భావించినప్పటికీ చివరి క్షణంలో వీలుగాక రద్దయినట్లు చెప్పారు. ప్రధాని పదవికి పోటీ పడినపుడు, ఇతర సందర్భాలలో చైనా వ్యతిరేక వైఖరి ప్రదర్శించిన రిషి ఏ ముఖం పెట్టుకొని జిన్‌పింగ్‌తో భేటీ అవుతారని స్వదేశంలో విమర్శలు తలెత్తవచ్చనే కారణంగా రద్దు చేసుకొని ఉండవచ్చు. నేతల మధ్య జరిగే సంభాషణలను మీడియాకు లీక్ చేసే బుద్ధి ఏమిటని ఈ సందర్భంగా కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడేవ్‌ను సీ జిన్‌పింగ్ నిలదీసినట్లు వార్తలొచ్చాయి. మీకు చిత్తశుద్ధి ఉంటే చర్చించుకుందాం రండన్నారు. దీనికి జస్టిన్ స్పందిస్తూ ప్రతి అంశాన్ని బహిరంగంగా చర్చించటం తమకు అలవాటని దాటవేశారు. లడఖ్ సరిహద్దులో జరిగిన సంఘటనల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్రమోడీ ఈ సమావేశాల్లో కొందరు నేతలతో భేటీ జరిపినా సీ జిన్‌పింగ్‌తో విందు సందర్భంగా కరచాలనానికే పరిమితమయ్యారని, అది కూడా వచ్చే ఏడాది జి20 సారథిగా భారత్ ఉండటం, షాంఘై సహకార సంస్థ 2023 శిఖరాగ్ర సభ భారత్‌లో జరగనున్న పూర్వరంగంలో సంప్రదింపులకు అవసరం రీత్యా ఆ మేరకైనా స్పందించినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. జి20 18వ సమావేశం మన దేశంలో జరగనుంది. ఎక్కడ సమావేశం జరిగితే ఆ దేశం ఏడాది పాటు సారథిగా ఉంటుంది. జి20ని ఐదు బృందాలుగా చేశారు. రెండవ గ్రూపు లోని రష్యా, టర్కీల్లో ఇప్పటికే సమావేశాలు జరగ్గా మన దేశంలో వచ్చే ఏడాది, దక్షిణాఫ్రికాలో 2025లో జరపాలని గతంలోనే ఖరారైంది. వచ్చే ఏడాది జరిగే సమావేశాలను మరుసటి ఏడాది జరిగే ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా నరేంద్రమోడీ ముందుకు తెస్తారని కాంగ్రెస్ పేర్కొన్నది. ప్రతి దాన్ని తమ ఖాతాలో వేసుకొని ప్రచారం చేసుకుంటున్న తీరుతెన్నులను చూసిన తరువాత నరేంద్రమోడీ 2023ను ఎంచుకోవటంలో ఆ కోణం లేదని చెప్పలేము. సమావేశ లోగోలో బిజెపి కమలం గుర్తును పెట్టటం కూడా దీనికి బలం చేకూర్చుతున్నది. నిజానికి వరుస క్రమంలో ఏ దేశం అంతర్జాతీయ వేదికలకు సారథ్యం వహించినప్పటికీ సదరు దేశానికి ప్రత్యేకంగా ఒరిగేదేమీ ఉండదు.

- ఎం.కె.ఆర్

కామన్‌స్పేస్

భౌతికవాదాన్ని తవ్వితీసిన దేవీప్రసాద్ చటోపాధ్యాయ

డా॥ దేవరాజు మహారాజు



> వైదిక ధర్మ ప్రచారకుల వేదాల అబద్ధపు కట్టడాల్ని కూల్చివేస్తూ... వారు భూస్థాపితం చేసిన భారతీయ భౌతిక వాదాన్ని అదే భూమి పొరల్లోంచి తవ్వితీశాడు. ఒకప్పుడు దేశంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న లోకాయత-చార్వాక తాత్వికతను దేశ ప్రజలకు విడమర్చి చెప్పాడు. వైదిక పురాణాలు ప్రచారం చేసిన భ్రమల్ని బద్దలు కొట్టాడు. అన్నింటికీ 'కారణం'-హేతువు ప్రధానమని, అది వైజ్ఞానిక అవగాహన మీద ఆధారపడి ఉండాలని చెప్పిన మహనీయుడాయన! తత్వశాస్త్రాన్నీ, వైజ్ఞానికతనూ కట్టగట్టి కొత్త ఆలోచనలకు దారులు వేసిన పరిశోధకుడాయన!

ఒకప్పుడు ప్రపంచానికి భౌతిక వాదాన్ని పరిచయం చేసిందే మన దేశం. ఇక్కడి చార్వాక-లోకాయత ఆలోచనా విధానాన్ని మనువాదులు అన్యాయంగా అణగదొక్కారు. భూస్థాపితం చేశారు. తమ కట్టుకథల్ని ప్రచారం చేసుకుని అదే మన సంస్కృతి, అదే మన సంప్రదాయం అని బుకాయించారు. అయినా భౌతిక వాదం ఎక్కడికీ పోలేదు. ఈ నేలలోనే ఉంది. ఈ గాలిలోనే ఉంది. లోకాయత అంటే లోకేశు ఆయుతం: అని అర్థం. అంటే లోకంలో వ్యాప్తి చెందిన ప్రజల దృక్పథం – అని అర్థం! వీరు లోకాన్నే విశ్వసిస్తారు. ఎక్కడా లేని ఇతర లోకాలను నమ్మరు. లోకంలోని లోకులను మాత్రమే విశ్వసిస్తారు. లోకాయత ప్రజల తత్వ శాస్త్రం. ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలు జరగక ముందే (బిసిఈ) లోకాయతులు ప్రపంచమే వాస్తవం అన్నారు. నాలుగైదు మూలకాల సంయోగం వల్లనే ఈ ప్రపంచం ఏర్పడిందన్నారు. నీరు, నిప్పు, గాలి, భూమి -నాలుగు మూలకాలయితే, అయిదోది ఆకాశం అన్నారు. చైతన్యం అనేది పంచ భూతాల నుండి వస్తుందన్నారు. 'భూతే బాహ్య చైతన్యం!' మనుషులందరి శరీరాలు ఒకటే – ముక్కు, ముఖం, చేతులు, కాళ్ళు అందరికీ ఒకేలా ఉన్నప్పుడు, జీవన క్రియలు ఒకేలా జరుగుతున్నప్పుడు ఈ వర్ణ వ్యవస్థ ఎందుకూ? ఈ కులాల తారతమ్యాలు ఎందుకూ? అసలు అవి ఉండాల్సిన అవసరం ఏమిటీ? అని లోకాయతులు సాధారణ శకానికి ముందే ప్రశ్నించారు. వీరే అతి ప్రాచీన భారతీయ భౌతికవాదులు. ఈ ప్రపంచాన్ని ఏ శక్తీ నడిపించడం లేదని, ఆత్మ, పునర్జన్మ మోక్షం వంటివి ఉండవని చాటి చెప్పారు.

దేవీప్రసాద్ చటోపాధ్యాయ అనే మార్క్సిస్టు మేధావి, తత్వవేత్త 1918 నవంబర్ 19-1993 మే 8 మధ్య కాలంలో ముందుకొచ్చాడు. వైదిక ధర్మ ప్రచారకుల వేదాల అబద్ధపు కట్టడాల్ని కూల్చివేస్తూ...వారు భూస్థాపితం చేసిన భారతీయ భౌతిక వాదాన్ని అదే భూమి పొరల్లోంచి తవ్వితీశాడు. ఒకప్పుడు దేశంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న లోకాయత – చార్వాక తాత్వికతను దేశ ప్రజలకు విడమర్చి చెప్పాడు. వైదిక పురాణాలు ప్రచారం చేసిన భ్రమల్ని బద్దలు కొట్టాడు. అన్నింటికీ 'కారణం'-హేతువు ప్రధానమని, అది వైజ్ఞానిక అవగాహన మీద ఆధారపడి ఉండాలని చెప్పిన మహనీయుడాయన! తత్వశాస్త్రాన్నీ, వైజ్ఞానికతనూ కట్టగట్టి కొత్త ఆలోచనలకు దారులు వేసిన పరిశోధకుడాయన! చరిత్రకు, సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలకు సైన్సు వెన్నెముక కావడం మనం చూశాం. కానీ, దేవీప్రసాద్ చటోపాధ్యాయ కొత్తగా ఫిలాసఫీకీ సైన్సుకూ ఉన్న సంబంధాన్ని హేతు బద్ధంగా చెప్పి – నిరూపించాడు!

ప్రాచీన భారతీయ భౌతిక వాదాన్ని అధ్యయనం చేసి, ఆయన ప్రకటించిన 'లోకాయత' మాత్రమే కాదు, వైజ్ఞానిక శాస్త్రాల చరిత్రను, ప్రాచీన భారత దేశంలో వైజ్ఞానిక పద్ధతుల్ని ఆయన గ్రంథాలుగా తీసుకొచ్చాడు. ఇవే కాకుండా ప్రాచీన భారతదేశంలో విజ్ఞాన శాస్త్రం-సమాజం వంటి గ్రంథాలు బహుళ ప్రజాదరణ పొందాయి.

ఆయన గ్రంథం లోకాయత (ఎ స్టడీ ఇన్ ఏన్షియంట్ ఇండియన్ మెటీరియలిజమ్-1959) దేశంలోనే కాదు, విదేశాల్లోనూ సంచలనం సృష్టించింది. భారతీయ మార్క్సిస్టు తాత్వికత గూర్చి ప్రపంచానికి ఒక కొత్త అవగాహనను కలిగించింది. దేవీప్రసాద్ చటోపాధ్యాయ రచనలు "సైన్స్ అండ్ సొసైటీ ఇన్ ఏన్షియంట్ ఇండియా"- సంపుటాలు; "వాట్ ఈజ్ లివింగ్ అండ్ వాట్ ఈజ్ డెడ్ ఇన్ ఇండియన్ ఫిలాసఫీ", "ట్రూ ట్రెండ్ ఇన్ ఇండియన్ ఫిలాసఫీ", "రెలిజియన్ అండ్ సొసైటీ" వంటి గ్రంథాలను తిరగేస్తే ఒకప్పుడు ప్రపంచానికి భౌతికవాదం బోధించిన భారతదేశం ఈ రోజు ఎందుకు ఇలా కుప్పగూలిపోయిందో అర్థమవుతుంది. అంతేకాదు, దాన్ని పునరుద్ధరించుకోవాల్సిన బాధ్యత నేటి యువతరం మీద ఎంత ఉందో అంచనా వేసుకోవడానికీ వీలవుతుంది. కార్యాచరణకు ప్రేరణ లభిస్తుంది.

లోకాయత వాదాన్ని బృహస్పతి ఆవిష్కరించాడని అంటారు. లోకంలో విస్తృతంగా ప్రచారం పొందినది కనక లోకాయుతం అయింది. ఈ వాదాన్ని చార్వాకం అని కూడా అంటారు. మాధవాచార్య ఆ పదానికి అర్థం చెప్పాడు. చారూ అంటే తియ్యని అని, వాక్ అంటే మాట అని చెప్పాడు. యదార్థాల్ని సున్నితంగా చెప్పడం- అని కూడా మనం అనుకోవచ్చు. 1. యావత్ జీవేతూ సుఖ్‌జీవేతూ (జీవితాంతం సుఖంగా జీవించు) 2. రుణమూ కృత్వా ఘృత పీవేతూ (అప్పు చేసైనా నెయ్యి తాగు) 3. భస్మీ భూతస్య దేహస్య (కాలిపోయి బూడిద అయ్యే ఈ దేహం) 4. పునరాగమన కృత: (మళ్ళీ తిరిగి వస్తుందని ఎలా అనుకుంటావూ?) నెయ్యి తాగు – అంటే ఇక్కడ నెయ్యనే కాదు. పాలు, పెరుగు, శరీరానికి అవసరమైన పౌష్టికాహారం అని అర్థం. చనిపోయాక ఈ దేహం కాలిస్తే బూడిద అవుతుంది. పూడిస్తే మట్టి అవుతుంది. అంతేగాని ఇక పునరాగమనం ఎక్కడా? శరీరం ఎలా తిరిగి వస్తుంది అని ప్రశ్నించారు. అంటే పునర్జన్మ అబద్ధమనీ, అది ఉండదనీ చెప్పారు. మోక్షానికి కూడా ఆధారం లేదన్నారు.

శరీరమే ముఖ్యం. వైదికులు చెప్పే ఆత్మ ఉండాలన్నా కూడా శరీరం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి కదా? అప్పు చేసైనా సుఖంగా ఉండు – అన్నది ఎందుకంటే అప్పు తీసుకున్న వాడు, అప్పు ఇచ్చినవాడూ ఇద్దరూ ఏదో ఒక నాటికి నశించాల్సిన వాళ్ళే. కానీ జీవిని, ప్రాణాన్ని కష్టపెట్టకుండా కాపాడుకొమ్మని చార్వాకులు చెప్పారు. మిధ్యావాదాన్ని నమ్మగూడదని- అన్నారు. సంశయ వాదం, సందేహ వాదాన్ని ప్రమాణంగా తీసుకోలేదు. కర్మఫలం ఉండదు. స్నేహితులతో, బంధువులతో బతికినంత కాలం సంతోషంగా గడపడమే జీవితం! వారినందరినీ పక్కకు నెట్టి, ఎక్కడా లేని పరలోక సుఖాల కోసం పూజలు, యజ్ఞాలు చేయడం మూర్ఖుల లక్షణం-అన్నారు. తర్కాన్ని – అనుభవాన్ని – మాత్రమే నమ్ముకోవాలి. అంతేగాని, ఆత్మను, పునర్జన్మను, స్వర్గనరకాలను, కర్మకాండను నమ్ముకోగూడదన్నది వారి సిద్ధాంతం! వైదిక ధర్మంలో యజ్ఞయాగాలకు, జంతు బలులకు చాలా ప్రాముఖ్యం ఉంది. ఆ యజ్ఞాలు బ్రాహ్మణాధిపత్యాన్ని సుస్థిరం చేసే కర్మకాండలు. కుల వ్యవస్థను పూర్తిగా వ్యతిరేకించిన లోకాయతులు యజ్ఞాలను, జంతుబలుల్ని తీవ్రంగా అడ్డుకున్నారు. బలి ఇచ్చిన పశువులు స్వర్గానికి వెళ్ళేట్లయితే, ఈ వైదిక పండితులు వృద్ధాప్యంతో సతమతమయ్యే తమ తండ్రిని బలిచ్చి నేరుగా స్వర్గం పంపవచ్చు కదా? అని సవాలు విసిరారు. లోకాయతుల అర్థవంతమైన ప్రశ్నలకు జవాబు చెప్పలేక వైదిక ధర్మ బోధకులు వక్ర భాష్యాలు చెప్పి, భౌతిక దాడులకు పూనుకుని కుట్ర పూరితంగా వారి గ్రంథాల్ని సైతం నాశనం చేశారు. కాల్చేశారు. అందుకే చార్వాక-లోకాయతలపై ప్రాచీన గ్రంథాలు మనకు దక్కలేదు.

దేవీప్రసాద్ చటోపాధ్యాయ లాంటి పరిశోధకుల కృషితో కొంతలో కొంత సమాచారం బయటికొచ్చింది. చార్వాక – జ్ఞాన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది. ప్రత్యక్ష ప్రమాణాలుంటేనే దేనినైనా స్వీకరించాలని ఈ సిద్ధాంతం చెప్పింది. ప్రత్యక్ష అనుభవం అనేది రుచి, వాసన, స్పర్శ, దృష్టి, శబ్దం వల్ల గ్రహించొచ్చు. జ్ఞానేంద్రియాలకు అందని భ్రమలు-కల్పితాలు! అప్రత్యక్ష విశ్వాసాల్ని భౌతికవాదం పరిగణన లోకి తీసుకోదు. గాలి, నీరు, అగ్ని, భూమితోనే ప్రతి పదార్థం రూపొందుతుంది గనక, "పదార్థమే" జీవనానికి ప్రధానం అన్నారు. 'మేటర్'ని గుర్తిస్తుంది గనక, ఈ సిద్ధాంతం "మెటీరియలిజం" అయ్యింది. జీవించి ఉన్న ప్రాణిలోని స్పృహ (కాన్షస్‌నెస్)ను వైదిక ధర్మం "ఆత్మ" అని భావించింది తప్పితే – ఆత్మ అనేది లేదన్నది చార్వాకులు గట్టిగా చెప్పారు.

ఒక రకంగా చార్వాక-లోకాయత అనేది భారతీయ తాత్విక దృక్పథంలో ప్రధానమైంది. ప్రపంచానికే తొలిసారి భౌతికవాదం గురించి చెప్పిన దేశం మన భారతదేశం. ఆ విషయం భారతీయులందరూ సగర్వంగా చెప్పుకోవాల్సింది పోయి, మనువాదుల చేతుల్లో కీలుబొమ్మలై, కల్పనల్లో ఊహించుకున్న దేవీ దేవతల మూర్తులకు పూజలు చేస్తూ దిగజారిపోయారు. ఆధిపత్య వర్గాలు ప్రజలను అబద్ధాల వెంట పరుగులు పెట్టించడానికి పుక్కిటి పురాణాలను, మూఢవిశ్వాసాలను ప్రోత్సహించాయి. అలా శతాబ్దాలు గడిచిపోయాయి. మధ్య మధ్యలో దేవీప్రసాద్ చటోపాధ్యాయ లాంటి వివేకవంతులు ఆధునిక కాలంలో కూడా భౌతికవాద ప్రాశస్త్యాన్ని ఎలుగెత్తి చెప్తూనే ఉన్నారు. 'దేబీదా'గా ప్రేమగా పిలవబడ్డ దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ చదువుకునే రోజుల్లో డిగ్రీలోనూ, పి.జి లోనూ గోల్డ్ మెడల్స్ సంపాదించారు. తత్వశాస్త్ర విద్యార్థిగా, అధ్యాపకుడిగా ఒక కొత్త ఒరవడి సృష్టించినందుకు చివరి దశలో ఆయనను ఒక సైన్స్ సంస్థ 'గెస్ట్ సైంటిస్ట్'గా సగౌరవంగా నియమించుకుంది. న్యూఢిల్లీ లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో కొంతకాలం ఉన్నారు. ఇది చాలా చాలా అరుదైన విషయం! భారత ప్రభుత్వం ఆయన కృషిని గుర్తించి, ఆయన మరణించిన తర్వాత ఐదేళ్లకు 1998లో పద్మభూషణ్ ప్రకటించింది. ఆయన కృషి వృధా పోలేదు.

ప్రస్తుతం పచ్చి మితవాద, మతవాద శక్తులు తమ భావజాలాన్ని ప్రజల మీద రుద్దుతున్న నేపథ్యంలో దేవీప్రసాద్ రచనలు అభ్యుదయ కాముకులకు, లౌకిక వాదులకు బలమైన ఆయుధాలుగా తోడ్పడతాయి. రాగల కాలాలలో యువత బుద్ధుడు చెప్పిన "అత్ దీపోభవ' (నీవే దీపానివి అయిపో) అన్న మాటని గుండెల్లో నింపుకుని, వైజ్ఞానిక భౌతిక-మానవ వాదానికి దారులు వేస్తారు. తప్పదు!!

/ వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త/

రైతు వ్యతిరేక బిజెపిని ఓడించండి

- గుజరాత్ ప్రజలకు ఎస్‌కెఎం నేతల పిలుపు
- కార్పొరేట్ కోసమే జిఎం మస్టడ్
- 19న ఫతే దివస్
- రాష్ట్రపతి, గవర్నర్లకు ఎనిమిది డిమాండ్లతో కూడిన వినతులు


సమావేశంలో మాట్లాడుతున్న హన్నన్ మొల్లాతో పాటు ఎస్‌కెఎం నేతలు దర్శన్‌పాల్, యుధ్వీర్ సింగ్, అశోక్ దావలే, అవిక్ సాహా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతు వ్యతిరేక బిజెపిని ఓడించాలని గుజరాత్ ప్రజలకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలు పిలుపు ఇచ్చారు. దేశంలోని రైతాంగాన్ని బిజెపి నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. గురువారం నాడిక్కడ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌కెఎం నేతలు హన్నన్ మొల్లా, దర్శన్‌పాల్, యుధ్వీర్ సింగ్, అశోక్ దావలే, అవిక్ సాహా మాట్లాడారు. కార్పొరేట్ల కోసమే జిఎం మస్టడ్ మోడీ సర్కార్ తీసుకొచ్చిందని, దానిపై ఇంకా సరైన పరిశోధన కూడా జరగలేదని హన్నన్ మొల్లా విమర్శించారు. జిఎం మస్టడ్ చాలా ప్రమాదకరమైనదని, దీన్ని ఎఐకెఎస్, ఎస్‌కెఎం వ్యతిరేకిస్తున్నాయని స్పష్టం చేశారు. రైతు శత్రువు బిజెపిని గుజరాత్ ఎన్నికల్లో ఓడించాలని, అలాగే మిగిలిన పార్టీలను కూడా రుణమాఫీ, ఎంఎస్‌పిపై వైఖరి స్పష్టం చేయాలని ప్రజలు కోరాలని సూచించారు. చారిత్రాత్మక రైతు ఉద్యమం విజయవంతమై ఏడాది కావస్తున్నాకేంద్ర ప్రభుత్వం ఎస్‌కెఎంకు ఇచ్చిన హామీల్లో చాలా వరకు నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. గతేడాది నవంబర్ 19న రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించారని, అదే రోజు ఈ ఏడాది నవంబర్ 19న ఫతే దివస్‌గా నిర్వహిస్తామని తెలిపారు. ఎస్‌కెఎం పిలుపుతో 2020 నవంబర్ 26న లక్షలాది మంది రైతులు ఢిల్లీకి వచ్చారని, ఈ ఏడాది అదే రోజున అన్ని రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌లకు పాదయాత్రలు చేపట్టి, గవర్నర్లకు ఎస్‌కెఎం డిమాండ్లతో పాటు ఆయా రాష్ట్రాల్లో ప్రత్యేకమైన డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాలు సమర్పిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి కూడా డిమాండ్లతో కూడిన వినతి సమర్పిస్తామని అన్నారు. "కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టబద్ధ హామీ. రుణమాఫీ నుంచి రైతులకు స్వేచ్ఛ, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి. కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రాను తొలగించాలి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. పంట బీమా సదుపాయం కల్పించాలి. రైతులకు నెలకు రూ.5,000 పెన్షన్ ఇవ్వాలి. రైతులపై నమోదు చేసిన అక్రమ, నకిలీ కేసులను ఉపసంహరించుకోవాలి. చారిత్రాత్మక రైతు ఉద్యమంలో అమరులైన రైతులకు పరిహారం చెల్లించాలి" అంటూ ఎనిమిది డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. 2021 డిసెంబర్ 11న విజయం సాధించిన తరువాత రైతులు విజయ యాత్రలతో తమ తమ గ్రామాలకు తిరిగి వెళ్లారని, ఈ ఏడాది అదే రోజున విజయోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 1 నుండి 11 వరకు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేస్తామని అన్నారు. ఎంఎస్‌పి, రుణమాఫీపై రాష్ట్రాల అసెంబ్లీల్లో తీర్మానం చేయాలని ఎమ్మెల్యేలను కోరనున్నట్లు, అలాగే పార్లమెంట్ సమావేశాల్లో ఎంఎస్‌పి, రుణమాఫీ బిల్లు తీసుకురావాలని విజ్ఞప్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌కెఎం తదుపరి సమావేశం డిసెంబర్ 8న జరగనుందని, ఆ సమావేశంలో ఉద్యమ భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తామన్నారు. అలాగే ఆ సమావేశంలో "పూర్తి స్థాయి రుణమాఫీ, ఎంఎస్‌పి హామీ" కోసం పోరాటాన్ని ప్రకటిస్తామని తెలిపింది.



ప్రభుత్వ రంగాన్ని అమ్మొద్దు

- జంతర్ మంతర్‌లో బిఎంఎస్ ధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రభుత్వ రంగాన్ని అమ్మొద్దని బిజెపి అనుబంధ కార్మిక సంఘం బిఎంఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో ఆందోళన చేపట్టింది. "ప్రభుత్వ రంగాన్ని కార్పొరేటీకరణ చేయొద్దు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి, ఎంటిఎన్‌ఎల్, బిఎస్‌ఎన్‌ఎల్‌ల్లో పే రివిజన్, పెన్షన్ రివిజన్ చేయాలి. కార్మిక కోడ్‌లు రద్దు చేయాలి" అని ప్లకార్డుల పట్టుకొని ఆందోళన చేపట్టారు. బిఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణ్మయ్ పాండా ప్రారంభిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఉత్పత్తులను వైవిధ్య పరిచి ఆర్థిక సహాయం అందించి సంస్థలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి రవీంద్ర హిమ్తే, కేరళ సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. విజయకుమార్, తెలుగు రాష్ట్రాల నేత లక్ష్మారెడ్డి తదితరులు మాట్లాడారు. యుపిఎ హయాంలో ఉమ్మడి ట్రేడ్ యూనియన్‌లో భాగమైన బిఎంఎస్ 2014లో మోడీ అధికారంలోకి వచ్చాక నమ్మక ద్రోహ వైఖరిని అవలంబించింది. ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు ఉన్న ఓ సంస్థ మోడీపై స్పందించడం ఇదే తొలిసారి. కార్మిక వ్యతిరేక విధానాలపై మౌనం దాల్చడంపై ఆ సంస్థలో అసంతృప్తికి ఆజ్యం పోసినందున ఆందోళన చేపట్టింది.

పాట్నా హైకోర్టుకు జస్టిస్ అభిషేక్ రెడ్డి బదిలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ. అభిషేక్ రెడ్డి పాట్నా హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఆయనతో పాటు గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిఖిల్ ఎస్ కారియల్‌ను కూడా పాట్నా హైకోర్టుకు బదిలీ చేసింది. మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి రాజాను రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలో జరిగిన కొలీజియం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 53 మంది న్యాయమూర్తుల ఉండాల్సిన పాట్నా హైకోర్టులో నవంబర్ 1 నాటికి 34 మంది న్యాయమూర్తులు ఉన్నారు. 19 న్యాయమూర్తి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జస్టిస్ అభిషేక్ రెడ్డి బదిలీపై తెలంగాణ హైకోర్టులో న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. జస్టిస్ నిఖిల్ ఎస్ కారియల్‌ను బదిలీని వ్యతిరేకిస్తూ వందలాది మంది న్యాయవాదులు ఆందోళనకు దిగారు. గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం ముందు ఆందోళనకు దిగారు. దాదాపు 300 మంది న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. గుజరాత్ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ (జిహెచ్‌సిఎఎ) నిరవధికంగా విధులకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. జస్టిస్ నిఖిల్ ఎస్ కారియల్ బదిలీతో న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యం మరణించిందని, దానికోసం తాము మౌనం పాటిస్తున్నామని న్యాయవాది అన్నారు.

శిలాజ ఇంధనాల వాడకాన్ని నిర్మూలించే

ప్రస్తావనే లేకుండా కాప్ 27 ముసాయిదా



న్యూయార్క్ : ఈజిప్ట్‌లోని షర్మ్ ఎల్ షేక్ రిసార్టులో ఈ నెల 6నుండి జరుగుతున్న కాప్ 27 చర్చలు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో గురువారం వాతావరణ ఒప్పందం మొదటి ముసాయిదాను ఐక్యరాజ్య సమితి ప్రచురించింది. అన్ని శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశలవారీగా నిర్మూలించే విషయాన్ని ఈ ముసాయిదాలో ప్రస్తావించలేదు. కేవలం బొగ్గునే కాకుండా అన్ని శిలాజ ఇంధనాలను దశలవారీగా తొలగించే నిర్ణయం చేయాలని భారత్ తొలుత ప్రతిపాదించగా, యురోపియన్ యూనియన్, ఇంకా పలు దేశాలు సమర్థించాయి.

అడ్డూ అదుపు లేకుండా వాడుతున్న బొగ్గును దశలవారీగా ఎత్తివేసే దిశగా చర్యలను వేగవంతం చేసేందుకు నిరంతరంగా కృషి జరగాలని, ఆ కృషిని ప్రోత్సహించాలని ముసాయిదా పేర్కొంది. జాతీయ పరిస్థితులకు అనుగుణంగా, సమర్థవంతంగా లేని శిలాజ ఇంధనాల సబ్సిడీలను క్రమబద్ధీకరించాలని పేర్కొంది. పరివర్తనల దిశగా మద్దతునివ్వాల్సిన అవసరాన్ని గుర్తించాలని పేర్కొంది. గతేడాది గ్లాస్గో వాతావరణ ఒప్పందంలోనూ దాదాపు ఇదే భాషను ఉపయోగించారు.

దీనిపై భారత పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రతినిధిని సంప్రదించగా, ఇంకా చర్చలు కొనసాగుతున్నందున దీనిపై వ్యాఖ్యానించాలనుకోవడం లేదని చెప్పారు. ప్రస్తుత వాతావరణ చర్చల్లో ప్రధానంగా చర్చించబడిన నష్టపరిహారాన్ని ఇచ్చే సదుపాయాన్ని ఎప్పటి నుండి ప్రారంభిస్తారు, అందులోని ప్రామాణికాలేంటనే అంశాన్ని కూడా ఆ ముసాయిదాలో పేర్కొనలేదు.

నష్టపరిహారం అంశాన్ని పరిష్కరించడం కోసం ఒక నిధిని ప్రారంభించాలన్న నిర్ణయంతో కాప్ 27 సమావేశం ముగియాలని పేద, వర్ధమాన దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. సంపన్న దేశాలు వెలువరించే కాలుష్యాల ప్రభావం ప్రధానంగా తమవంటి చిన్న, నిరుపేద దేశాలపై వుంటోందని, ఫలితంగా ప్రకృతి విపత్తులతో తల్లడిల్లుతున్నామని, అందువల్ల ఆ నష్టాల భారాన్ని సంపన్నదేశాలే భరించాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా వుంది.

ప్రపంచ సగటు ఉష్ణోగ్రతల పెంపు 2డిగ్రీల సెల్సియస్‌కు దిగువగానే వుంచేలా చూడాలంటూ పారిస్ ఒప్పందంలో పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని స్థాయిల్లో కృషి జరగాలని, దీనికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని ఆ ముసాయిదా పేర్కొంది. 20పేజీలతో వెలువడిన ఈ ముసాయిదా పత్రంలో 8400 పదాలు వున్నాయి. గ్లాస్గో ఒప్పందంలో దాదాపు 4600 పదాలే వున్నాయి.

గృహ నిర్బంధం ఆదేశాలను పాటించడం లేదు

- సుప్రీం కోర్టును ఆశ్రయించిన గౌతం నవ్లాఖా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2018 భీమా కోరేగావ్ హింసాకాండ కేసులో నిందితుడైన గౌతం నవ్లాఖాను జైలు నుంచి తరలించి గృహ నిర్బంధంలో ఉంచాలని సుప్రీం కోర్టు ఆదేశించినా రాష్ట్ర అధికారులు పాటించడం లేదని గురువారం సుప్రీం కోర్టుకు తెలిపారు. గురువారం ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ముందు నవ్లాఖా తరపు న్యాయవాది నిత్యా రామకృష్ణన్ ప్రస్తావించారు. నవంబర్ 10న వచ్చిన ఆర్డర్‌ను పాటించడం లేదని తెలిపారు. మరోవైపు, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) తరపున సొలిసిటర్ జనరల్ (ఎస్‌జి) తుషార్ మెహతా నవ్లాఖా తనను గృహ నిర్బంధంలో ఉంచాలనుకుంటున్న ఇంటి వివరాలను అందించడానికి బదులు, లైబ్రరీ, కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన నివాస స్థలం వివరాలను అందించారని పేర్కొన్నారు. దీనికి నిత్యా రామకృష్ణన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అది లైబ్రరీ మాత్రమేనని స్పష్టం చేసింది. ఎన్‌ఐఎ కూడా కొన్ని ఆదేశాలను కోరుతుందని, అందుకే సోమవారం విచారణ జరపాలని ఎస్‌జి తుషార్ మెహతా కోరారు. హౌస్ అరెస్ట్ ఆర్డర్‌ను జారీ చేసిన జస్టిస్ కెఎం జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు నేడు (శుక్రవారం) జాబితా చేస్తామని సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ స్పష్టం చేశారు.

శరత్ చంద్రారెడ్డి ఇడి కస్టడీ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం విధానంలోని అవకతవకల్లో శరత్ చంద్రారెడ్డి, బినయ్ బాబులను ఇడి కస్టడీ మరో నాలుగు రోజులపాటు సిబిఐ ప్రత్యేక కోర్టు పొడిగించింది. గురువారం రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎం.కె నాగ్ పాల్ విచారించారు. శరత్ చంద్రారెడ్డి, బినయ్ బాబులను విచారించేందుకు ఈడికి అనుమతి ఇచ్చారు. తదుపరి విచారణ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకి వాయిదా వేసింది. ఈడి కస్టడీ పొడిగింపుపై శరత్ చంద్రారెడ్డి, బినయ్ బాబు తరపు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పిఎంఎల్‌ఎ సెక్షన్ 50 ప్రకారం ఇప్పటికే శరత్ చంద్రారెడ్డి స్టేట్ మెంట్ రికార్డు చేశారని, దర్యాప్తు పేరుతో రాజకీయ కక్ష సాధింపు జరుగుతుందని శరత్ చంద్రారెడ్డి తరపు న్యాయవాది ఎస్.సుధీర్ వాదనలు వినిపించారు. బినయ్ బాబు మల్టీ నేషనల్ కంపెనీలో పనిచేస్తున్నడని, 12 సార్లు స్టేట్ మెంట్ రికార్డు చేసారని, కస్టడీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరిన బినయ్ బాబు తరపు న్యాయవాది కోరారు.

రోదసీలో నడిచిన చైనా వ్యోమగాములు

బీజింగ్ : మానవ సహిత రోదసీయాన మిషన్‌లో భాగంగా షెంఝూ-14 వ్యోమగాములు గురువారం మూడోసారి రోదసీలో నడిచారు. ఈ నెల 3న చైనా రోదసీ స్టేషన్ మౌలిక నిర్మాణ కూర్పు పూర్తయింది. ఆ తర్వాత మొదటిసారిగా అంతరిక్ష నౌక నుండి బయటకు వచ్చిన వ్యోమగాములు అంతరిక్షంలో నడిచారు. ఉదయం 11.16 గంటల సమయంలో, వ్యోమగాములు విజయవంతంగా ఎయిర్‌లాక్‌ను తెరిచారు. షెంఝూ-14 మిషన్ కమాండర్ చెన్ డాంగ్ కేబిన్ నుండి ముందుగా బయటకు వచ్చారు. చెన్‌ను సహచర సభ్యుడు కాయ్ జూడాంగ్ అనుసరించారు. వారిద్దరు అంతరిక్షంలో అడుగులు వేస్తుండగా, ఏకైక మహిళా వ్యోమగామి లియూ యాంగ్ కేబిన్ లోపల వుండి వారికి సహకరించారని చైనా రోదసీ సంస్థ ప్రకటించింది.

మయన్మార్‌లో ఆరు వేల మంది ఖైదీలు విడుదల

నైఫిడా : మయన్మార్‌లోని అధికారిక జుంటా సైన్యం నలుగురు విదేశీయులతో సహా ఆరువేల మంది ఖైదీలను విడుదల చేసింది. జాతీయ దినోత్సవం సందర్భంగా క్షమాభిక్ష కింద వారిని అధికారిక జుంటా సైన్యం విడుదల చేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. నలుగురు విదేశీయులను విడుదల చేసి, దేశం నుండి బహిష్కరిస్తున్నట్లు మిలటరీ జుంటా అధికార ప్రతినిధి జా మిన్ తున్ గురువారం మీడియాకి తెలిపారు. బ్రిటీష్ మాజీ రాయబారి వికీబౌమాన్, ఆస్ట్రేలియాకు చెందిన ఆర్థిక సలహాదారు సీన్ టర్నెల్, జపాన్ జర్నలిస్ట్ టురు కుబోటా, అమెరికన్ వృక్షశాస్త్రజ్ఞుడు క్యావ్ హ్టే ఒలను మయన్మార్ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విడుదల చేసినట్లు వెల్లడించారు. విడుదలైన వారిలో 11 మంది ప్రముఖులు ఉన్నారని అన్నారు. గతేడాది ఫిబ్రవరిలో అధ్యక్షురాలు ఆంగ్‌సాన్ సూకీపై జుంటా సైన్యం తిరుగుబాటు ప్రకటించిన అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. సూకీని నిర్బంధించడంతో పాటు పలువురు నేతలను సైన్యం అదుపులోకి తీసుకుంది.

'రాజీవ్' దోషుల విడుదలను సమీక్షించండి

- సుప్రీంలో కేంద్రం

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకేసులో దోషులను విడుదల చేయడంపై కేంద్రం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. తగిన విచారణ లేకుండా దోషుల విడుదల జరిగిందని, ఇలా చేయడం న్యాయసూత్రాలను ఉల్లంఘించినట్లవుతుందని తెలిపింది. గత మూడు దశాబ్దాలుగా వారి జైలు జీవితం తమిళనాడులో ఓ రాజకీయ సమస్యగా మారిందని, ఇలాంటి సున్నితమైన అంశాల్లో కేంద్రం సలహా అవసరమని అభిప్రాయపడింది. మొత్తం ఆరుగురు దోషుల్లో నలుగురు శ్రీలంకకు చెందిన వారని, మాజీ ప్రధానిని హత్యచేసి ఉగ్రవాదులుగా ముద్ర పడినవారికి క్షమాభిక్ష పెట్టడం అంతర్జాతీయంగా ప్రభావం చూపిస్తుందని పిటిషన్‌లో పేర్కొంది. దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే అవకాశముందని తెలిపింది.

అనస్థీషియా లేకుండానే ట్యూబెక్టమీ

- బీహార్‌లో వైద్యుల నిర్లక్ష్యం

పాట్నా : ట్యూబెక్టమీ శస్త్ర చికిత్స కోసం వచ్చిన మహిళల పట్ల బీహార్‌లో వైద్యులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారు. అనస్థీషియా (మత్తు) ఇవ్వకుండానే 24 మంది మహిళలకు ట్యూబెక్టమీ ఆపరేషన్లు నిర్వహించారు. ఈ ఘటన రాష్ట్రంలోని ఖగారియా జిల్లా అలౌలీ హీత్ హెల్త్ సెంటర్‌లో జరిగింది. అక్కడి ఆరోగ్య సిబ్బంది తమని గట్టిగా పట్టుకోగా .. వైద్యులు ఈ చికిత్స నిర్వహించినట్లు మహిళలు స్థానిక మీడియాకి తెలిపారు. ట్యూబెక్టమీ ఆపరేషన్‌కు అనస్థీషియా (మత్తు) తప్పనిసరి అని నివేదికలు పేర్కొన్నప్పటికీ వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తుంది. మత్తు ఇవ్వకపోవడంతో మహిళలు తీవ్రమైననొప్పితో ఏడుస్తూ, కేకలు పెట్టినట్లు కొంత మంది మహిళలు మీడియాకు తెలిపారు. ఆ పరిస్థితిని చూసి భయంతో తాము శస్త్రచికిత్సకు నిరాకరించామని అన్నారు. ఓ ఎన్‌జిఒ ద్వారా ప్రభుత్వ పథకంలో భాగంగా ఈ ఆపరేషన్స్‌ను నిర్వహించారు. ఒక్కో ఆపరేషన్‌కు ఎన్‌జిఓకి రూ. 2,100 చెల్లించినట్లు తెలుస్తోంది. ఫిర్యాదులు అందడంతో గ్లోబల్ డెవలప్‌మెంట్ ఎన్‌జిఓను బ్లాక్‌లిస్ట్ చేశామని అలౌలి ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్ డాక్టర్ మనీష్ కుమార్ తెలిపారు. ఈ ఘటనపై ఖగారియా జిల్లా మెజిస్ట్రేట్ అలోక్ రంజన్ ఘోష్ విచారణకు ఆదేశించారు.

పశ్చిమ బెంగాల్‌కు కొత్త గవర్నర్‌గా ఆనంద బోస్

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌కు కేంద్ర ప్రభుత్వం కొత్త గవర్నర్‌ను నియమించింది. నూతన గవర్నర్‌గా మాజీ ఐఎఎస్ అధికారి డా.సి.వి.ఆనంద బోస్‌ను నియమిస్తున్నట్టు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి సి.వి.ఆనంద బోస్ బెంగాల్‌కు రెగ్యులర్ గవర్నర్‌గా కొనసాగుతారని తెలిపింది. రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న జగదీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో మణిపూర్ గవర్నర్ లా గణేషన్ అయ్యర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో జులై నుంచి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా బెంగాల్‌కు పూర్తికాలం గవర్నర్‌గా డా.సి.వి.ఆనంద బోస్‌ను నియమిస్తూ రాష్ట్రపతి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. కేరళకు చెందిన ఆనంద బోస్ గతంలో ఐఎఎస్ అధికారిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అనేక హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం మేఘాలయ ప్రభుత్వానికి సలహాదారుగా పనిచేస్తున్నారు.

నితిన్ గడ్కరీకి అస్వస్థత

సిలిగుడి: కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. బెంగాల్ పర్యటనలో ఉన్న ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతుండగా.. స్టేజీ పైనే అసౌకర్యానికి గురవడంతో వైద్యులు హుటాహుటిన ఆయనకు చికిత్స అందించారు.పలు అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు గడ్కరీ గురువారం సిలిగుడిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడు తుంగా.. స్టేజీపైనే అస్వస్థతకు గురయ్యారు. దీంతో గడ్కరీని అక్కడే ఉన్న గ్రీన్ రూంకు తీసుకెళ్లారు. గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేసి హుటా హుటిన వైద్యుడిని రప్పించారు. గ్రీన్ రూంలో ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత బిజెపి ఎంపి రాజు బిస్తా ఇంటికి తీసుకుని వెళ్లిరు.

జంతువులపైనే పరిశోధనలు!

(మొదటి పేజీ తరువాయి)

పాటించలేదంటూ డబ్ల్యుహెచ్‌ఓ ఈ నిర్ణయం తీసుకుంది. దీనిపై భారత్ బయోటెక్ ఎటువంటి ప్రకటన చేయలేదు. వివిధ దేశాలు తయారు చేసిన వ్యాక్సిన్‌లలో డబ్ల్యుహెచ్‌ఓ చేత సస్పెన్షన్‌కు గురైనది కోవాక్సిన్ ఒక్కటేఅని సమాచారం.

కేంద్రం ఏమంది?

పూర్తిస్థాయిలో ట్రయల్స్ నిర్వహించకుండానే రాజకీయ ఒత్తిళ్ల కారణంగా కోవాక్సిన్‌కు అనుమతించారనడాన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన ప్రకటనలో అన్ని శాస్త్రీయ విధానలకు అనుగుణంగా సూచించిన నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించిన తరువాతే అనుమతి ఇచ్చినట్లు పేర్కొంది. దీనికి భిన్నంగా తప్పుదోవ పట్టించేలా మీడియా కథనాలు ఉన్నాయని విమర్శించింది. 'సిడిఎస్‌సిఓ సబ్జక్టు ఎక్స్‌పర్ట్ కమిటీ 2021 జనవరి ఒకటి, రెండు తేదీలలో సమావేశమై తగిన చర్చల తరువాత భారత్ బయోటెక్ రూపొందించిన వ్యాక్సిన్‌కు పరిమితంగా, అత్యవసర వినియోగానికి సంబంధించి అనుమతి ఇచ్చారు' అని పేర్కొంది.

హిందూత్వం వైపు యుజిసి మొగ్గు

- ప్రజాస్వామ్యానికి తల్లి భారత్ అంశంపై ఉపన్యాసాలకు చర్యలు
- ఇప్పటికే పలు కళాశాలలకు ఆదేశాలు

న్యూఢిల్లీ : ఈనెల 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) వేడుకలకు సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగా 'భారతదేశం : ప్రజాస్వామ్యానికి తల్లి' లేదా ' భారత్ : లోక్‌తంత్ర కీ జననీ' అనే అంశంపై ఉపన్యాసాలు నిర్వహించాలని భావిస్తున్నది. ఇందులో భాగంగా ఇప్పటికే కళాశాలలను ఈ కార్యక్రమాలను నిర్వహించాలని కోరింది. అయితే, యుజిసి నిర్ణయంపై మిశ్రమ స్పందన వస్తున్నది. ప్రపంచంలో యునైటెడ్ స్టేట్స్ పురాతన ప్రజాస్వామ్యంగా ఉన్నదనీ, అయితే, భారత్‌ను ప్రజాస్వామ్యానికి తల్లిగా పేర్కొంటూ యుజిసి చేస్తున్న ప్రయత్నాలు కొంత ఆశ్చర్యం కలిగిస్తున్నాయన్నారు. దేశ గొప్పతనాన్ని చాటి చెప్పటంలో తప్పులేదనీ, కానీ, అవాస్తవాలను ప్రచారం చేసేలా యూజీసీ వంటి చేస్తున్న ప్రయత్నాలు ఎలాంటి సందేశాన్నిస్తాయని వారు ప్రశ్నించారు.కచ్చితంగా ఇవి హిందూత్వం వైపు యూజీసీ అడుగులంటూ పలువురు విమర్శిస్తున్నారు.

కాగా ఈ ఉపన్యాసాలలో భాగంగా, యుజిసి ఉపన్యాసాల ఇతివృత్తాలను రూపొందించటంలో సహాయం చేయటానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ (ఐసిహెచ్‌ఆర్)ని ఉపయోగించుకున్నది. ఇది వేదాల కాలం నుంచి భారత్‌లో ప్రబలంగా ఉన్న ప్రజాస్వామ్య ఆలోచన నుంచి తీసుకోబడింది. అయితే, ఇలాంటి అంశాలతో ఆధునిక ప్రజాస్వామ్యానికి ముడి పెట్టటంపై మరికొందరు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఉపన్యాసాలు నిర్వహించటమే కాకుండా నవంబర్ 15 నుంచి 30 వరకు ప్రత్యేక ఉపన్యాసాలు చేపట్టాని యూజిసి చైర్‌పర్సన్ ఎం. జగదీశ్ కుమార్ 45కి పైగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో పాటు 45 డీమ్డ్ యూనివర్సిటీలకు లేఖ రాశారు. 1949లో ఇదే రోజున (నవంబర్ 26న) బీఆర్ అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగానే యావత్ దేశం రాజ్యాంగ దినోత్సవాన్ని పాటిస్తుంది.

దేశం విడిచి పారిపోతానా? : సోరెన్

రాంచీ : తాను ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రినని, దేశాన్ని విడిచి పారి పోవడానికి వ్యాపారవేత్తను కానని ఇడి సమన్లపై జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వ్యాఖ్యానించారు. గురువారం ఇడి విచారణకు హాజరవడానికి ముందు రాంచీలోని తన నివాసంలో మద్దతుదారులనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. తాను ముఖ్యమంత్రిగా రాజ్యాంగబద్ధమైన పదవిని కలిగి ఉన్నానని, అయితే విచారణ జరుగుతున్న తీరు , ఇడి సమన్లు పంపుతున్న తీరు చూస్తుంటే తాను దేశం విడిచిపారిపోయే వ్యక్తిలా వారు భావిస్తున్నట్లు కనిపిస్తుందని ఇడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా వ్యాపారవేత్తలు తప్ప నేతలెవరూ దేశం విడిచి వెళ్లిన సందర్భాలు లేవని, ఏ రాజకీయ నేత అలా పారిపోలేదని చెప్పారు. రాష్ట్రంలో జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) -కాంగ్రెస్‌ల సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న పెద్ద కుట్రలో ఇడివిచారణ ఒక భాగమని విమర్శించారు.

వంతెన కూలిన ఘటనకు బాధ్యత మాదే : మోర్బీ మునిసిపాలిటీ

గాంధీనగర్ : మోర్బీలో కేబుల్ బ్రిడ్జీ కూలిన ఘటనకు బాధ్యత తమదేనని ఆ పట్టణ మునిసిపాలిటీ ప్రకటించింది. ఈ మేరకు మోర్బీ మునిసిపల్ కార్పోరేషన్ గుజరాత్ హైకోర్టులో గురువారం అఫిడవిట్ సమర్పించింది. గత నెలలో మోర్బీ బ్రిడ్జి కూలిన ఘటనలో 130మందికి పైగా మరణించిన సంగతి తెలిసిందే. "ఆ బ్రిడ్జిని తెరవ కుండా ఉండాల్సింది" అని మోర్బీ మునిసిపల్ కార్పోరేషన్ అఫిడవిట్‌లో పేర్కొంది. దీంతో హైకోర్టు మునిసిపల్ కమిషనర్ సందీప్‌సింగ్ జాలాకి సమన్లు జారీ చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. అక్టోబర్ 30న మోర్బి బ్రిడ్జి కూలిన ఘటనలో 135 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ కేసును హైకోర్టు సుమోటగా స్వీకరించి విచారిస్తున్న సంగతి తెలిసిందే.

బ్రిటన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి

లండన్ : పన్నులను పెంచుతూ, ప్రభుత్వ వ్యయంపై పట్టు బిగిస్తూ బ్రిటన్ ఆర్థిక మంత్రి జెరిమీ హంట్ గురువారం కఠినమైన బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే మాంద్యంలో వుందని పార్లమెంట్‌లో మాట్లాడుతూ ఆయన చెప్పారు. వచ్చే ఏడాదికి ఆర్థిక వ్యవస్థ మరింత కుంచించుకుపోయే అవకాశాలు వున్నాయని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో బాధాకరమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోక తప్పలేదన్నారు. ఫైనాన్షియల్ మార్కెట్లు తిరిగి పునరుద్ధరించబడాలంటే ఈ చర్యలు తప్పవన్నారు. "విశ్వసనీయత దానంతట అదే రాదు, ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి మనం నిరంతరంగా కృషి చేస్తూనే వుండాలని నిన్నటి ద్రవ్యోల్బణ గణాంకాలు చెబుతున్నాయి." అని ఆయన పేర్కొన్నారు. పన్ను నిబంధనల్లో మార్పులను మంత్రి ప్రకటించారు. ఈ మార్పుల కారణంగా మరింతమంది మౌలిక ఆదాయపన్ను చెల్లించాల్సి వుంటుంది.





మీ కోసం

మెత్తగా దంచిన వాము చూర్ణాన్ని ఒక గ్లాసు మజ్జిగలో కలిపి తీసుకుంటే కఫం పలచబడుతుంది. శ్వాస మార్గాలు శుభ్రం అవుతాయి.

జీవన సౌరభం

పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది.

నక్షత్రం... ఇదిగో ఇలా పుడుతోంది!

పిల్లలూ
మనం రోజూ ఆకాశంలో నక్షత్రాలను చూస్తుంటాం కదా! ఈ రోజు జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ఆ నక్షత్రం పుట్టుకను ఫొటో తీసిన అబ్బుర చిత్రాన్ని చూద్దామా!

విశ్వానికి సంబంధించిన అద్భుతమైన దృశ్యాలను మనకు అందిస్తున్న జేమ్స్ వెబ్ టెలిస్కోప్ మరోసారి అబ్బురపరిచే చిత్రాలను తీసింది. తాజాగా అంతకుముందు చూడని కాస్మిక్ మేఘాలను చిత్రీకరించింది. నారింజ, నీలిరంగు ధూళికి సంబంధించిన ఫొటోలను జెమ్స్ వెబ్ తీసింది. భూమికి 430 కాంతి సంవత్సరాల దూరంలో ఉంటూ, అప్పుడే పుట్టడం ప్రారంభించిన ఓ నక్షత్రం చేస్తున్న విధ్వంసాన్ని క్లిక్ మనిపించింది. ఈ ఫొటోలో టారస్ నక్షత్ర మండలంలోని ప్రోటోస్టార్ ఎల్1527 అనే నక్షత్రం ఏర్పడుతున్నపుడు, దాని చుట్టూ ఆవరించి ఉన్న కాస్మిక్ మేఘాలను చూడవచ్చు. పరారుణ కాంతిలో మాత్రమే కనిపించే మేఘాలను నియర్-ఇన్‌ఫ్రారెడ్ కెమెరా ద్వారా జేమ్స్ వెబ్ ఈ ఫొటో తీసింది. నక్షత్రం నుంచి వెలువడుతున్న పదార్థం దాని చుట్టు పక్కల ఉన్న పదార్థంతో ఢీకొట్టినట్లు కనిపిస్తోంది. ఎల్1527 నక్షత్రం వయసు కేవలం లక్ష ఏళ్లు మాత్రమే అని..ఒక నక్షత్ర వయసుతో పోల్చి చూస్తే ఇది కేవలం యవ్వన దశలో మాత్రమే ఉందని నాసా పేర్కొంది.

దీన్ని నక్షత్ర ప్రారంభ దశ ప్రోటోస్టార్‌గా పరిగణిస్తారు. విశ్వం పుట్టుక, ఎక్సో ప్లానెట్స్, నక్షత్రాల పుట్టుకకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు జేమ్స్ వెబ్‌ని ప్రయోగిస్తున్నారు. బ్లాక్ హోల్స్, అనేక గెలాక్సీలను, నెబ్యులాలకు సంబంధించిన ఫొటోలను తీసి శాస్త్రవేత్తలనే అబ్బురపరుస్తోంది ఈ జేమ్స్ వెబ్. 10 బిలియన్ డాలర్ల భారీ ఖర్చుతో ఈ టెలిస్కోప్‌ను నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీలు నిర్మించాయి.



నేను గీసిన బొమ్మ





- డి. శ్రీలక్ష్మి,
6వ తరగతి,
జెడ్పిహెచ్ స్కూలు,
ఉప్పలపాడు,
అనంతసాగరం మండలం,
నెల్లూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆమెకు భరోసా ఇవ్వండి ...

'ఇద్దరూ ప్రేమించుకున్నారు. కలిసిజీవిస్తున్నారు. పెళ్లి చేసుకుందామని ఆమె చెప్పినప్పుడు అకస్మాత్తుగా అతడు క్రూరుడుగా మారిపోయి ఆమెను కడతేర్చాడు. చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఖండఖండాలుగా నరికేశాడు' ఇదీ గత కొన్ని రోజులుగా దేశరాజధాని ఢిల్లీలో జరిగిన శ్రద్ధా వాకర్ (26) హత్య కేసుపై వస్తున్న వార్తా కథనాలు. అయితే అతనిలో ఇంతటి క్రూరత్వం అకస్మాత్తుగా సంభవించిందా? కానే కాదు.. కొన్నేళ్లుగా ఆమె అతని నుంచి హింసనెదుర్కొంది. ఎందరో గృహహింస బాధితుల్లాగ తను కూడా మౌనంగా అతని క్రూరత్వం భరించింది.





సాధారణంగా మహిళలను (వివాహితులు/ అవివాహితులు) హత్య చేసిన ఉదంతాలు బయటపడినప్పుడు సుదీర్ఘకాలంగా భాగస్వాముల నుంచి వారు అనుభవించిన హింస బహిర్గతమౌతుంది. దురదృష్టమేమంటే ఆమె పడుతున్న గృహహింస సన్నిహితులందరికీ తెలుసు. చివరికి తల్లిదండ్రులకు, స్నేహితులకు కూడా తెలుసు. కాని సరైన సమయంలో స్పందించకపోవడం వల్లే శ్రద్ధ లాంటి మహిళలు హత్యలకో, ఆత్మహత్యలకో బలౌతున్నారు. విచారించదగ్గ విషయమేమంటే గృహహింసను 'ప్రైవేట్ విషయంగా' ఈ సమాజం పరిగణిస్తుంది. భర్త హింసిస్తున్నాడని కూతురు పుట్టింటికి వెళితే సర్దిచెప్పి పంపించడమో.. అల్లుడికి బుద్ధి చెప్పి కూతురును మళ్లీ అతని ఇంటికే పంపించడమో చేస్తారు చాలామంది తల్లిదండ్రులు. ఈ రకమైన ధోరణికి నిరక్షరాస్యులు, విద్యావంతులన్న వ్యత్యాసమేమీ లేదు. ఎందుకంటే పురుషుడి తోడు లేకుండా ఒంటరిగా బతికే ఆడవాళ్లంటే ఈ సమాజానికి చులకన ఎక్కువ.

ఇక శ్రద్ధ కేసులో మనకు చాలా విషయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విద్యావంతురాలైన శ్రద్ధ కోరుకున్న వ్యక్తితో కలిసి జీవించడం తల్లిదండ్రులకు నచ్చలేదు. ఆమెను దూరం పెట్టారు. ఈ వ్యతిరేకత ఆమెను బలహీనపరచి సహచరుడు అఫ్తాబ్‌కు బలాన్నిచ్చి ఉండవచ్చు. శ్రద్ధ ఒక్కత్తే కాదు. ప్రేమించి పెళ్లి చేసుకున్నారనో, తమ కులం కాదనో, మతం కాదనో, అంతస్తు లేదనో ఎందరో ఆడపిల్లలను కుటుంబాలు అక్కున చేర్చుకోవు. ఫలితంగా భాగస్వాముల నుంచి ఎదురయ్యే హింసను వారు భరించక తప్పడం లేదు.

మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలు చాలా వరకు సన్నిహితుల నుంచి ఎదురయ్యేవేనని అనేక నివేదికలు చెబుతున్నాయి. 'ఈ దేశంలో మహిళలు ఇళ్లల్లో కంటే వీధుల్లో సురక్షితంగా ఉంటున్నారం'టూ 2014లో ఓ గృహహింస కేసు విషయంలో తీర్పు చెబుతూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇంట్లో ఆమె ఎదుర్కొంటున్న హింసకు ఇదే గొప్ప నిదర్శనం.

శ్రద్ధాకు న్యాయం జరగాలని, అఫ్తాబ్ చేసిన ఘోరమైన నేరానికి శిక్ష పడాలని చాలామంది వ్యాఖ్యానిస్తున్నారు. అది కచ్చితంగా జరిగి తీరాలి. అయితే అంతకంటే ముందు గృహహింస ఎదుర్కొంటున్న మహిళలకు అండగా నిలబడాలి. తమ మీద జరుగుతున్న దాడిని బహిర్గతం చేస్తే తనకు తప్పక న్యాయం జరుగుతుందని నమ్మే వాతావరణం కల్పించాలి. ఈ దేశంలో గృహహింస బాధితుల రక్షణార్థం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎన్నో హెల్ప్ లైన్లు పనిచేస్తున్నాయి. కాని వాటిలో చాలా వరకు నిరుపయోగంగా మిగిలిపోయాయి.

మన చుట్టూ కులాంతర, మతాంతర, స్వలింగసంపర్కులు, సహజీవనం, ఒకే గోత్రికులు, ప్రేమ వివాహాలు వంటి అనేక రకాల జంటలు జీవిస్తున్నాయి. ఈ జంటల మధ్య ఏదేని మనస్పర్థలు, దాడులు, హింస బహిర్గతమైనప్పుడు కుటుంబం, మీడియా, పోలీసులు, రాజకీయ నాయకుల జోక్యంతో జరుగుతున్న అన్యాయం మరో కోణంలో కనబడుతోంది. ఈ ధోరణి బాధితులకు అండగా నిలబడదు. వారిని మరింత అభద్రతకు గురిచేస్తుంది. శ్రద్ధ విషయంలో జరిగిందదే. విద్యావంతురాలైన ఆమె భాగస్వామి నుంచి ఎదురైన హింసను సకాలంలో బయటపెట్టగలిగితే తన ప్రాణం దక్కేది. కాని చెబితే ఏమౌతోందన్న భయం ఆమె నోరు నొక్కేసింది. ఫలితంగా ఇంతటి దారుణం జరిగింది.

చాలామంది మహిళలు గృహహింసను భరించలేక ఇంటి నుంచి బయటికి వచ్చేసిన ఘటనలు మనం చూస్తుంటాం. కాని ఆ మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయడం, భర్త ఇంటివారిపై చర్యలు తీసుకోవడం చాలా తక్కువ. ఎందుకంటే భర్తతో లేదా భాగస్వామితో శాశ్వతంగా విడిపోయే వరకు ఆమె అనేకసార్లు తిరిగి అతని ఇంటికి వచ్చేస్తుంది. అందుకే గృహహింస బాధితులకు అండగా ఉండడం, వారి బాధలు వినడం కంటే ముందు వారికి ఎప్పుడు? ఏ సహాయం అవసరం? నిర్ణయించుకునే సామర్థ్యం గల వ్యక్తులుగా తయారుచేయాలి.

భాగస్వామి నుంచి విడిపోయిన వారిని అవమానించకుండా, వారికి అవసరమైన సాయాన్ని అందించాలి. అప్పుడే ఆమె ఏ ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నా మిమ్మల్ని సంప్రదిస్తుంది. ఆ ఆదరణ ఆమె ప్రాణాలను కాపాడుతుంది.





సాయం కోసం కాంతారావు కుటుంబం

400 సినిమాలకు పైగా నటించిన అలనాటి తెలుగు ప్రముఖ హీరో కాంతారావు వారసులు ఇప్పుడు దీన స్థితిలో ఉన్నారు. ఒకప్పుడు చెన్నైలో బంగ్లాలో ఉన్న ఈ కుటుంబం ఇప్పుడు కనీసం సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్నారు. కాంతారావుకు ఇద్దరు కొడుకులు. ప్రస్తుతం తెలంగాణలో నివసిస్తున్న కాంతారావు వారసులు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'దానధర్మాలు చేసి.. ఆస్తులను అమ్మి సినిమాలను నిర్మించడం ద్వారా తీవ్రమైన ఆర్థిక సమస్యల బారిన పడ్డాం' అంటూ ఆయన కొడుకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం కాంతారావు శతజయంతి వేడుకలు నిర్వహించింది.

'హరిహర వీరమల్లు' లొకేషన్‌లో క్రిష్



నటుడు పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న చిత్రం 'హరిహర వీర మల్లు'. కొన్ని రోజుల క్రితం క్రిష్ టీంతో కలిసి వర్క్ షాప్‌లో కూడా పాల్గొన్నారు. కాగా పవన్ కల్యాణ్ తాజాగా షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. చాలా కాలం తర్వాత పవన్ కల్యాణ్ యాక్షన్ మూడ్‌లో చూడటం సంతోషంగా ఉంది.. కెప్టెన్, డైరెక్టర్ క్రిష్ జాబ్‌లో ఉన్నారు.. అంటూ లొకేషన్‌లో డైరెక్టర్ క్రిష్ స్టిల్‌ను షేర్ చేశాడు హరీష్ శంకర్. రామోజీ ఫిలింసిటీలో ప్రస్తుతం హై ఆక్టేన్ యాక్షన్ సీన్లు షూట్ చేస్తున్నారు. 1000 మంది జూనియర్ ఆర్టిస్టులతో సాగే ఈ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్లు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎంఎం కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు.

రామ్‌చరణ్ వర్కౌట్స్



సినిమా పాత్రల విషయంలో హీరోలు రిస్క్ తీసుకుని కష్టపడతారు. అందులో రామ్‌చరణ్ ఒకరు. తాను నటిస్తున్న ఆర్‌సి 15 చిత్రంలో పాత్రకు తగ్గట్టుగా కనిపించాలని కష్టపడుతున్నారు. దానికి సంబంధించిన వీడియో ఒకటి ఆయన ట్వీటర్‌లో పోస్టు చేశారు. ట్రైనర్ పర్యవేక్షణలో బరువులు ఎత్తుతూ, ఫుట్‌బాల్ ఆడుతూ, స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ కనిపించారు చరణ్. దీంతో 'డెడికేషన్ అంటే ఇది'...అంటూ అభిమానులు కొనియాడుతున్నారు. చరణ్ చిత్రం సెకెండ్ షెడ్యూల్ చిత్రీకరణకు సిద్ధమతున్నట్లు కనిపిస్తోంది. దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తోన్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోంది. హీరోయిన్‌గా కియారా అద్వానీ నటిస్తుంది. పొలిటికల్ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు.

'లవ్ టుడే' ట్రైలర్ విడుదల



ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'లవ్ టుడే' టాలీవుడ్ నిర్మాత దిల్ రాజు ఇదే టైటిల్‌తో తెలుగులో కూడా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ను హీరో విజయ్ దేవరకొండ విడుదల చేశారు. ప్రేమించుకున్న హీరో,హీరోయిన్లు ఇంట్లో పెళ్లికి ఒప్పిస్తారు. ఈ నేపథ్యంలో ఇద్దరు ఫోన్లు మార్చుకోవాలంటూ సత్యరాజ్ చెబుతారు. ఫోన్లో ఉన్న మెసెజ్‌లు వల్ల వారి ఇద్దరి మధ్య జరిగిన గొడవలు, పరిణామాలు ఇద్దరినీ అయోమయ పరిస్థితుల్లోకి నెడతాయి. ఆ తర్వాత ఏం జరిగిందనేదే సస్పెన్స్. ఈ చిత్రంలో ఇవానా హీరోయిన్‌గా నటించింది. సత్యరాజ్, రాధికా శరత్ కుమార్, యోగిబాబు ప్రధాన పాత్రలు పోషించారు. ఏజీఎస్ ఎంటర్‌టైనమెంట్ బ్యానర్‌పై కల్పతి ఎస్. అఘోరం, కల్పతి ఎస్. గణేష్, కల్పతి ఎస్. సురేష్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు.

అవయవ దానం చేస్తున్నా!



హైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ ఆసుపత్రి నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన విజయ్ దేవరకొండ, తన అవయవాలు అన్నిటినీ దానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 'ఆర్గాన్స్ డొనేషన్‌కు అందరూ ముందుకు రావాల'ని విజ్ఞప్తి చేశారు. విజయ్ దేవరకొండ మాత్రమే కాదు... ఆయన తల్లి మాధవి కూడా ఆర్గాన్స్ డొనేట్ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్గాన్స్ డొనేట్ చేయాలనుకోవడంతో పాటు ఆరోగ్యంగా ఉండటం కూడా ముఖ్యమని కార్యక్రమంలో విజయ్ ప్రసంగిస్తున్న వీడియో సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతోంది.

యువ క్రికెటర్లకు సదవకాశం

నేడు న్యూజిలాండ్‌తో తొలి టి20
మధ్యాహ్నం 12.00గం॥ల నుంచి



వెల్లింగ్టన్: భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడు టి20ల సిరీస్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇరుజట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌కు వెల్లింగ్టన్ ఆతిథ్యమివ్వనుంది. సీనియర్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, బుమ్రా, షమీ, దినేశ్ కార్తీక్‌లకు విశ్రాంతినివ్వడంతో యువ క్రికెటర్లతో టీమిండియా బరిలోకి దిగుతోంది. హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా, రిషభ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా బిసిసిఐ ఎంపిక చేసింది. ఫామ్‌లో ఉన్న సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌లో ఉండగా.. యువ బ్యాటర్లు తమ సత్తా చాటి రాబోయే టోర్నీల్లోనూ తమ బెర్త్‌లను ఖాయం చేసుకోవాలని చూస్తున్నారు. ముఖ్యంగా శుభ్‌మన్ గిల్, సంజూ శాంసన్, దీపక్ హుడా, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లకు ఈ ఫార్మాట్ కీలకం కానుంది. బౌలర్ల విషయానికొస్తే.. యువ పేసర్లు ఉమ్రన్ మాలిక్, హర్షల్ పటేల్‌పైనే ఆశలున్నాయి. ఇక సీనియర్ లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్, కుల్దీప్ జట్టుకు అండగా ఉండనే ఉన్నారు. న్యూజిలాండ్ పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలించనున్నాయి. ఇక భారత ఫాస్టెస్ట్ బౌలర్ ఉమ్రాన్ మాలిక్ ఏ మేరకు రాణిస్తోడో వేచిచూడాల్సి ఉంది. ఆల్‌రౌండర్ల కోటాలో దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్ కూడా అవకాశాలకోసం వేచిచూస్తున్నారు. ఇరుజట్లు ఇప్పటివరకు 20 టి20ల్లో తలపడగా.. 11 మ్యాచుల్లో భారత్.. 9మ్యాచుల్లో న్యూజిలాండ్ విజయం సాధించాయి.

జట్లు

ఇండియా: హార్దిక్(కెప్టెన్), సంజు, పంత్(వికెట్ కీపర్లు), ఇషాన్ కిషన్, శుభ్‌మన్, దీపక్ హుడా, సూర్యకుమార్, శ్రేయస్, సుందర్, చాహల్, కుల్దీప్, హర్షల్, సిరాజ్, భువనేశ్వర్, అర్ష్‌దీప్, ఉమ్రన్.

న్యూజిలాండ్: విలియమ్సన్(కెప్టెన్), అలెన్, బ్రాస్‌వెల్, కాన్వె(వికెట్ కీపర్), ఫెర్గుసన్, మిఛెల్, మిల్నే, నీషమ్, ఫిలిప్స్, సాంట్నర్, టిమ్ సౌథీ, ఇష్ సోథీ, టిక్నెర్.

గ్రూప్ ఆఫ్ డెత్ జి



దోహా: ఫిఫా ప్రపంచకప్ ఆదివారం నుంచి ప్రారంభం కానుండగా.. ఈ టోర్నీలో ఆడే 32జట్లను 8గ్రూపులుగా విభజించడం జరిగింది. మొత్తం 832మంది ఆటగాళ్లు ఆడనున్నారు. ప్రతి గ్రూప్‌లో రెండు జట్లు బలమైన జట్లుగా ఉండగా.. గ్రూప్-జిలో నాలుగుజట్లు టైటిల్ ఫేవరెట్ జట్లే కావడం విశేషం. అత్యధికసార్లు ఈ టైటిల్‌ను నెగ్గిన బ్రెజిల్‌తోపాటు సెర్బియా, స్విట్జర్లాండ్, కామెరూన్ జట్లు ఈ గ్రూప్‌లో ఉన్నాయి. ఇవన్నీ టైటిల్‌ను సాధించగల జట్లే. బ్రెజిల్ జట్టు ఏకంగా 5సార్లు ఫిఫా ప్రపంచకప్ టైటిల్‌ను సాధించింది. చివరి సారిగా బ్రెజిల్ జట్టు 2018 ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్ వరకు చేరగలిగింది. ఇక సెర్బియా, స్విట్జర్లాండ్ జట్లు 2018 ఫిఫా ప్రపంచకప్ గ్రూప్ దశకే పరిమితం కాగా.. కామెరూన్ జట్టు ఆ ఏడాది ఫిఫా ప్రపంచకప్‌కు అర్హత సాధించలేకపోయింది. ఈ గ్రూప్‌లో బ్రెజిల్ జట్టు 25న సెర్బియాతో, 28న స్విట్జర్లాండ్‌తో, డిసెంబర్ 3న కామెరూన్‌తో బ్రెజిత్ తలపడనుంది. ఈ గ్రూప్‌నుంచి బ్రెజిల్, కామెరూన్ ప్రి క్వార్టర్స్‌కు అర్హత సాధించొచ్చు.

తొలి వన్డేలో ఆసీస్ గెలుపు

ఆడిలైట్: టి20 ప్రపంచకప్ ఛాంపియన్ ఇంగ్లండ్‌తో గురువారం జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 287పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఓపెనర్లు జేసన్ రాయ్(4), సాల్ట్(14) నిరాశపరిచినా.. మలన్(134) భారీ శతకంతో రాణించాడు. ఆ తర్వాత మిగతా బ్యాటర్స్ నిరాశపరిచినా.. చివర్లో విల్లీ(34) మెరిసాడు. జంపా, కమ్మిన్స్‌కు మూడేసి, స్టార్క్, స్టోయినీస్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో ఆస్ట్రేలియా ఓపెనర్లు డేవిడ్ వార్నర్(86), హెడ్(69) తొలి వికెట్‌కు 147పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత స్టీవ్ స్మిత్(80నాటౌట్), గ్రీన్(20నాటౌట్) రాణించడంతో ఆసీస్ జట్టు 46.5ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 291పరుగులు చేసి గెలిచింది. విల్లీకి రెండు, జోర్డాన్, డాసన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మలన్‌కు లభించగా.. రెండో వన్డే సిడ్నీ వేదికగా శనివారం జరగనుంది.

అశ్విన్ హెబ్బర్ సెంచరీ

బీహార్‌పై 132పరుగుల తేడాతో గెలుపు
విజయ్ హజారే వన్డే టోర్నీ రిజల్ట్స్



బెంగళూరు: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. ఎలైట్ గ్రూప్-ఇలో ఆంధ్రప్రదేశ్ జట్టు 132పరుగుల తేడాతో బీహార్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 302పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. అశ్విన్ హెబ్బర్ (154)భారీ శతకానికి తోడు హనుమ విహారి(52)అర్ధసెంచరీతో మెరిసారు. మలయ్ రాజ్‌కు రెండు, హర్షసింగ్, సచిన్‌కుమార్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం ఆంధ్ర బౌలర్లు హరిశంకర్‌రెడ్డి(3/21), బండారు అయ్యప్ప(2/19), షోయబ్(2/30) బౌలింగ్‌లో రాణించడంతో బీహార్ జట్టు 44.3ఓవర్లలో 170పరుగులకే ఆలౌటైంది.

ఎలైట్ గ్రూప్-బిలో హైదరాబాద్‌జట్టు 7వికెట్ల తేడాతో ఉత్తరప్రదేశ్ చేతిలో ఓటమి పాలైంది. హైదరాబాద్ జట్టు 50ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 256పరుగులు చేయగా.. ఉత్తరప్రదేశ్ జట్టు 48.4ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 262పరుగులు చేసి గెలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68